
ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 54 | ఆదివారం 23 నవంబర్ 2025 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati




## భగవాన్ శ్రీ సత్యసాయిలో
# విశ్వ ప్రేమ

- సాయి బోధనలు లక్షల మందికి మార్గనిర్దేశనం
- పుట్టపర్తి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము..
- సేవే ధర్మం..ప్రేమే సాయి మార్గం
- లక్షల మందికి తాగునీటి వసతి సౌకర్యం..
- పేదలకు ఉచితంగా వైద్య సేవల కల్పన..
- సాయి శతజయంతి ఉత్సవాల్లో సిఎం చంద్రబాబు






**పుట్టపర్తి, నవంబర్ 22 :**

విశ్వప్రేమ నిండిన శ్రీ సత్యసాయి మహాసమాధిని దర్శించుకోవడం తన అదృష్టమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నిర్వహించిన శ్రీసత్యసాయి శత జయంతి వేడుక ల్లో ఆమె పాల్గొన్నారు. సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న అనతంరం రాష్ట్రపతి ప్రసంగించారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. ఆయన బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి. ఆయన సందేశంతో కోట్ల మంది భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపు తున్నానని రాష్ట్రపతి అన్నారు. పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందని ప్రభావితం చేశాయని అన్నారు. లక్షలాది మందికి మార్గం చూపాయనివ్యాఖ్యానించారు. పుట్టపర్తికి వచ్చిన రాష్ట్రపతికి సీఎం, మంత్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం 2లో

# సిఎం సీరియస్

- కాకినాడ ఆసుపత్రిలో 8నెలల గర్భిణి మృతి...
- రాజమండ్రి ఆసుపత్రిలో 55ఏళ్ల రోగికి గడువు ముగిసిన మందులు
- కాకినాడ, రాజమండ్రి ఆసుపత్రులసిబ్బందిపై ఆగ్రహం..
- శాఖాపరమైన చర్యలకు సిఎం చందబ్రాబు ఆదేశం



**అమరావతి, నవంబర్ 22 :**

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇవాళ అనూహ్యంగా డాక్టర్లపై సీరియస్ అయ్యారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లోని కాకినాడ, రాజమండ్రి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడితో ఆగకుండా వారిపై చర్యలకు కూడా ఆదేశించారు. దీంతో ఈ వ్యవహారం రాష్టవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ ఈ రెండు ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బందిపై సీఎం ఆగ్రహం వెనుక కారణమేంటో పరిశీలిస్తే కాకినాడ, రాజమండ్రి ప్రభుత్వాసుపత్రుల్లో తాజాగా రెండు అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నాయి. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఈ రెండు వరుస సంఘటనలు చోటుచేసుకోవడంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరిగిన ఘటనలో తాళ్లరేవు మండలం గడిమొగ గ్రామానికి చెందిన (మిగతా 2లో)

## మావోఇస్టు పార్టీకి
# మరో భారీ షాక్

- వరుస ఎన్‌కౌంటర్ల తరవాత 37మంది లొంగుబాటు
- లొంగిపోయిన వారిలో కేంద్ర కమిటీ సభ్యులు ఆజాద్
- గణపతి, ఇతరులు అజ్ఞాతం వీడి రావాలన్న డిజిపి



**హైదరాబాద్, నవంబర్ 22 :**

మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. వరుస ఎన్‌కౌంటర్ల తరవాత తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, ఎకె47లు, భారీగా బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు (మిగతా 2లో)

## దక్షిణ అండమాన్ మధ్యలో
# అల్పపీడనం

- ఏపికి భారీ వర్ష సూచన
- అప్రమత్తంగా వుండాలని హెచ్చరిక



**అమరావతి, నవంబర్ 22 :**

మలక్కా- దక్షిణ అండమాన్ సముద్రం మధ్య అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణించి ఈ నెల 24న ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వాయుగుండం మరింత బలపడే సూచనలు ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. 48 గంటల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాలో ఓ మోస్తరు వర్షాలు కురిసే (మిగతా 2లో)

## యూనివర్సిటీలలో
# పోస్టులు భర్తీ

- ఫీజు రీఎంబర్స్‌మెంట్ లో విద్యార్థులపై ఒత్తిడిచేస్తే కళాశాలలపై చర్యలు ..
- కళాశాలలు, వర్సిటీలలో రాజకీయ ప్రసంగాలు బంద్
- ఖాళీగా వున్న 4300 అధ్యాపక పోస్టులు బర్తీ
- విద్యాశాఖామంత్రి లోకేష్



**అమరావతి, నవంబర్ 22 :**

ఏపీ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ తాజాగా ఒక శుభవార్త చెప్పారు. ఉద్యోగాల కోసం ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు త్వరలో యూని వర్సిటీలలో ఉద్యోగాల భర్తీ ఉండబోతుందని ఆయన ప్రకటించారు. ఉండవల్లి లోని తన నివాసంలో విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నాయకులతో సమావేశమైన నారా లోకేష్ ఈ సందర్భంగా కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపు కోసం కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసు కుంటుం దని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రైవేట్ కళాశాలలు, విద్యార్థులపై ఒత్తిడి తెస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేష్ హెచ్చరించారు.గతప్రభుత్వం (మిగతా 2లో)

## శ్రీ సత్యసాయి ఆశీస్సులతో అగ్రస్థానానికి
# భారత్

- సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి...
- సాయిసమాధి వద్ద నివాళి అర్పించిన రాధాకృష్ణన్...




**పుట్టపర్తి, నవంబర్ 22 :**

సత్యసాయి ఆశీస్సులతో 2047 నాటికి భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ఆశిస్తున్నట్టు ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ తెలిపారు. సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో పాల్గొనడం గౌర వంగా భావిస్తున్నానని అన్నారు. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉప రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నవంబర్ 22 విశిష్టత గురించి సీఎం చెప్పగానే (మిగతా 2లో)

## తెలంగాణ ఉపముఖ్యమంత్రి అన్నపూర్ణ స్టూడియో
# సందర్శన

- ఫిల్మ్, మీడియాలో విద్యార్థుల సృజనాత్మకతకు ఫిదా
- అక్కినేని నాగార్జున దంపతుల పట్టుదలకు అభినందన



**హైదరాబాద్, నవంబర్ 22 :**

2047నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ లక్ష్యంలోచిత్ర పరిశ్రమ కీలక (మిగతా 2లో)

## పోలీసుల విచారణలో
# రవి మౌనం

- విదేశీ సంస్థలతో సంబంధాలపై నోరు విప్పని ఐబొమ్మ రవి
- మూడోరోజు ముగిసిన విచారణ




**హైదరాబాద్, నవంబర్ 22 :**

సినిమాల పైరసీ కేసులో ఐ బొమ్మ ఇమంది రవి పోలీసుల విచారణ శనివారం మూడో రోజు ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో భాగంగా ఇమంది రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీశారు. పైరసీకి ఎవరు సహకారం అందిస్తున్నారు.. తెర వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారనే విషయాలపై పోలీసులు ప్రశ్నించారు. సైబర్ నేరాలకు ఐ బొమ్మ సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచు కున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సినిమాల సేకరణ, సైట్‌లో అప్‌లోడ్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. అయితే, విచారణలో పోలీసులకు రవి సహకరించడం లేదని సమాచారం. పోలీసులు అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు చెబుతున్నాడని తెలిసింది. యూజర్ ఐడీ, పాస్‌వర్డులు అడిగితే గుర్తు లేదు.. మరిచిపోయానని రవి సమాధానం చెప్పినట్లు సమాచారం. ఎథికల్ హ్యాకర్ల (మిగతా 2లో)

## సిబిఐ కోర్టు
# వీడియోలు

- కోర్టులో వ్యవహారం వీడియోలు ప్రసారం చేసిన వారిపై కేసు నమోదు చేయాలి..
- మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్




**తాడేపల్లి, నవంబర్ 22 :**

వైఎస్సార్సీపీ వైఎస్ జగన్ సీబీఐ కోర్టులో ఉన్నప్పుడు వీడియో ఎలా తీశారు? అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు.ఆ వీడియోలను ప్రసారం చేసిన ఎల్లోమీడియా, సోషల్ మీడియాపై కేసులు పెట్టాలి అని డిమాండ్ చేశారు. కుట్ర, చంద్రబాబు కవల పిల్లలు అంటూ సెటైర్లు వేశారు.మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'వైఎస్ జగన్ కోర్టులో ఉన్న వీడియోలు రిలీజ్ చేయటం నేరం. దీనిపై కోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలి. దొంగతనంగా వీడియోలు తీసిన వారిపై చర్యలు తీసుకోవాలి. జడ్జి గారిని కూడా వీడియో తీసి దాన్ని ఎల్లో మీడియాలో ప్రసారం చేశారు. జడ్జిని కూడా చూపుతూ వీడియోలు తీయటం తీవ్రమైన నేరం. ఆ ఛానళ్లపై కోర్టు చర్యలు తీసుకోవాలి. వైఎస్ జగన్ అంటే ఎల్లో మీడియాకు భయం అందుకే.. ప్రతి నిమిషం జగన్ నామస్మరణే చేస్తున్నారు.ఎల్లోమీడియాకు విపరీతమైన కుల గజ్జి పట్టింది. జగన్ (మిగతా 2లో)

## ఇప్పుడున్న స్థితిలో ఇక
# ఉద్యమించలేం

- పార్టీకి తెలియచేసి లొంగిపోయాం
- ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్న ఆజాద్



**హైదరాబాద్, నవంబర్ 22 :**

మేం పార్టీకి చెప్పే లొంగిపోయామని మావో యిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాంబయ్య అలియాస్ ఆజాద్ తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టు పార్టీ పిలుపుని స్తుందని పేర్కొన్నారు. స్టేట్ (మిగతా 2లో)

# భగవాన్ శ్రీసత్యసాయిలో విశ్వప్రేమ




(మొదటి పేజి (తరువాయి)

పుట్టపర్తిలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారని కొనియాడారు. బాబా సందేశంతో కోట్లాదిమంది భక్తులు మానవ సేవ చేస్తున్నారని ప్రశంసించారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారని కీర్తించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు ఆమె వెంట ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు. అంతకుముందు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి చంద్రబాబు, లోకేశ్ ఘన స్వాగతం పలికారు. సత్యసాయి బాబా తన సందేశాలతో చాలామందిలో పరివర్తన తెచ్చారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి సమస్య లేకుండా బాబా అనేక ప్రాజెక్టులు నెలకొల్పారు. విరాళాల రూపంలో వచ్చిన నిధులను ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించారు. అనేక గ్రామాల్లో లక్షల మందికి తాగునీరు అందించారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారు. సత్యసాయి ట్రస్టుకు లక్షల మంది వాలంటీర్లు ఉన్నారు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మి సత్యసాయి ఆచరించారు. భగవాన్ సాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించింది. దాన్ని మనమంతా అర్థం చేసుకోవాలని చంద్రబాబు అన్నారు. లవ్ ఆల్.. సర్వ్ ఆల్, ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలని... ఎవ్వరినీ నొప్పించకూడదు అనేది సత్యసాయి బాబా సిద్ధాంతమని చంద్రబాబు నాయుడు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనే ఈ ఐదు సూత్రాలను సత్యసాయి బాబా చెప్పేవారని గుర్తు చేశారు. సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు.. సూత్రాలను పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుందన్నారు. ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారన్నారు. కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు... పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి తాగు నీటి ప్రాజెక్టులకు నిధులను సమకూర్చారని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. ఇప్పటికీ అదే స్ఫూర్తిని సత్యసాయి బాబా భక్తులు కొనసాగించడం తనకు సంతోషాన్ని ఇస్తోందన్నారు. సత్యసాయి బాబాతో తనకు మంచి అనుబంధం ఉందని సీఎం గుర్తుచేశారు. వివిధ ప్రాణాంతక రోగాల బారిన పడిన వారిని సత్యసాయి బాబా ట్రస్టు ఆదుకుంటోందని సీఎం పేర్కొన్నారు. మానవ సేవే... మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని సత్యసాయి బాబా ట్రస్టు అమలు చేసి చూపిస్తోందన్నారు. శాంతికి బ్రాండ్ అంబాసిడర్ లాగా సత్యసాయి బాబా నిలుస్తారని చెప్పుకొచ్చారు. 7.50 లక్షల మంది వాలంటీర్లు సత్యసాయి బాబా ట్రస్టు ద్వారా సేవలందించారని...ఏ వ్యవస్థకు ఇంతటి శక్తి లేదన్నారు. ఇవాళ సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఏమైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవలందిస్తారన్నారు. ధనవంతులు, పెద్ద ఉన్నతాధికారుల కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రశాంతి నిలయానికి పంపి సేవా కార్యక్రమాలు చేయిస్తారన్నారు. 140 దేశాల్లో 2 వేలకు పైగా బ్రాంచ్‌లు సత్యసాయి బాబా ట్రస్టుకు ఉన్నాయన్నారు. భగవాన్ సత్యసాయి బాబా భక్తులు శాంతికి అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రపతి ముర్ము జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



# అగ్రస్థానానికి భారత్




(మొదటి పేజి (తరువాయి)

వస్తానని చెప్పా. ఇప్పటికే దేశంలో ముగ్గురు ప్రముఖులు పుట్టపర్తిని సందర్శించారు. సమాజ సేవ కోసం సత్యసాయిబాబా నాయకులను తయారు చేశారు. విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని లోకేశ్ ఆహ్వానించగానే అందరూ స్వాగతించారు. విద్యార్థులు దేశ నాయకులుగా ఎదుగుతారనేందుకు ఇదే నిదర్శనం. జీవితంలో ప్రతి రోజూ చాలా కీలకం. మానవ జీవితాలు యాంత్రికంగా, ఆధ్యాత్మికంగా సాగుతున్నాయి. విద్యాసంస్థ ద్వారా క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం నేర్పుతున్నారు. విద్యార్థులకు నైతిక విలువలు నేర్పే కేంద్రంగా సత్యసాయి విద్యాసంస్థ విలసిల్లుతోందని ఉప రాష్ట్రపతి అన్నారు. అంతకుముందు శ్రీ సత్యసాయి శతజయంతి వేడుకల్లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. సత్యసాయి మహా సమాధి వద్ద నివాళు లర్పించారు. ఆయన వెంట సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ తదితరులు ఉన్నారు. అనంతరం.. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. వ్యక్తిత్వ కేంద్రంగా సత్యసాయి వర్సిటీ నిలుస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'సత్యసాయి వర్సిటీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ప్రత్యేక ఆశయంతో సత్యసాయిబాబా భూమిపైకి వచ్చారు. సత్యసాయి.. భగవాన్ సాయి సిద్ధాంతం వ్యాప్తి చేశారు. క్రమశిక్షణ, ప్రేమ, సేవాభావం కలిగి ఉండాలని చెప్పారు. భారత్.. వేల ఏళ్లుగా ఆధ్యాత్మిక భావనలతో వర్ధిల్లుతోంది. వసుదైక కుటుంబం.. ప్రపంచమంతా ఒకే కుటుంబం అనేది మన సంస్కృతిలో ఉంది. సత్యసాయి విద్యాసంస్థ నైతికత, విలువలతో కూడి ఉంటుంది. విద్యార్థులకు ఆధ్యాత్మికత, సేవాభావాన్ని విద్యాసంస్థ నేర్పిస్తుంది. అందరినీ ప్రేమించాలి.. సేవ చేయాలి అనేది భగవాన్ సాయి సిద్ధాంతం. సహాయ గుణం కలిగి ఉండాలే కానీ, ఎవరినీ నొప్పించవద్దనేది సిద్ధాంతం. సత్యం, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు సూత్రాలు చెప్పారని సీఎం అన్నారు.



# మరో భారీ షాక్

(మొదటి పేజి (తరువాయి)

ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం అని తెలిపారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తాం. మిగతావాళ్లు కూడా తొందరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అన్నారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణెళిశ్,బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. మావోల లొంగుబాటు సందర్భంగా ఆయన పలు అంశాలు వివరించారు. ఏ రకంగా బయటికి వచ్చినా.. మావోయిస్టులను అన్ని విధాలుగా ప్రభుత్వం చూసుకుంటుందని డీజీపీ అన్నారు. మీడియా ద్వారా వచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా వచ్చినా, రాజకీయ నాయకుల ద్వారా వచ్చినా తాము స్వాగతిస్తామని డీజీపీ పేర్కొన్నారు. మావోయిస్టులు పార్టీ పరంగా విబేధాలు, ఆరోగ్య కారణాలు, ఇలా అనేక కారణాలతో బయటికి వస్తున్నారని డీజీపీ తెలిపారు. 'తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్ మీద రూ.20లక్షల రివార్డ్ ఉంది. అప్పాసి నారాయణ మీద రూ.20లక్షలు రివార్డ్ ఉంది. మిగతా వారికి రూ.25 వేలు చొప్పున ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. 11 నెలల్లో 465మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 59మంది తెలంగాణకు చెందిన వారని డీజీపీ వెల్లడించారు.

# అన్నపూర్ణ స్టూడియో సందర్శన



(మొదటి పేజి (తరువాయి)

పాత్ర పోషిస్తుంది. ఈ భవిష్యత్తును నిర్మించడంలో చిరంజీవి, అక్కినేని నాగార్జున వంటి సీనియర్ సినీ దిగ్గజాల మద్దతు కోసం మేము ఎదురుచూస్తున్నామని అన్నారు. అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ / మీడియాను సందర్శించి విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించారు. 1970లో కనీస మౌలిక సదుపాయాలు లేని ఈ ప్రాంతంలో దిగ్గజ అక్కినేని నాగేశ్వరరావు అన్నపూర్ణ స్టూడియోలను ఎలా స్థాపించారో, అప్పటి నుండి అది హైదరాబాద్‌లోని అత్యంత ముఖ్యమైన సాంస్కృతిక మరియు సినిమాటిక్ ల్యాండ్‌మార్క్‌లలో ఒకటిగా ఎలా ఎదిగిందో గుర్తుచేసుకుంటూ, సంస్థ యొక్క గొప్ప వారసత్వాన్ని భట్టి విక్రమార్క ప్రశంసించారు. అన్నపూర్ణ కళాశాలలో ప్రపంచ స్థాయి చలనచిత్ర విద్య ద్వారా ఈ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో నాగార్జున అక్కినేని, అమల అక్కినేని విజన్ ను ఆయన అబినందించారు. అన్నపూర్ణ కళాశాల విద్యార్థులు రూపొందించిన రోల్ నంబర్ 52ని నేను చూశాను. నాకు ఎంతగానో నచ్చింది, మనసుని హత్తుకునే మంచి సినిమా తీసినందుకు దర్శకుడిని వారి టీమ్ ను అభినందిస్తున్నాను. అన్నపూర్ణ కళాశాలలో ఎందరో ప్రతిభావంతులు, వారి ప్రతిభ గురించి అక్కినేని నాగార్జున స్వయంగా నాతో మాట్లాడారు, అదే నన్ను ఇన్స్పైర్ చేసింది. మీ అందరిని కలవడానికే ఇక్కడికి వచ్చానని అన్నారు. అక్కినేని నాగార్జున మాట్లాడుతూ ' నా తండ్రి తెలుగు చిత్ర పరిశ్రమను చెన్నై నుండి హైదరాబాద్‌కు తరలి వచ్చినపుడు ఆయన విజన్ కు అనుగునంగా అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించబడింది. నేడు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో భారతదేశంలోని అత్యుత్తమ సంస్థలలో అన్నపూర్ణ స్టూడియోస్ ఒకటిగా నిలిచింది. అన్నపూర్ణ కళాశాల భవిష్యత్ కథకులను పెంపొందించాలనే తన కలను కొనసాగిస్తోంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ రోజు మా స్టూడియోస్ ను సందర్శించడం మాకు గౌరవంగా ఉంది. ప్రపంచ సినిమాలో తెలంగాణ వృద్ధికి మద్దతు ఇవ్వడానికి మేము ఎప్పుడు రెడీగా ఉంటామమని అన్నారు. అనంతరం డిప్యూటీ ముఖ్యమంత్రి అన్నపూర్ణ స్టూడియోస్, సౌండ్ / విజన్ భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ ఫెసిలిటీ సినిమాను కూడా సందర్శించారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలు అత్యాధునిక సాంకేతికత వివరాలు అడిగి తెల్సుకుని నాగార్జునను మెచ్చుకున్నారు.

# ఇప్పుడున్న పరిస్థితిలో ఇక ఉద్యమించలేం



**హైదరాబాద్, నవంబర్ 22 :**

కమిటీలో ఉన్న ఇంకా ఇద్దరు అగ్రనేతలు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. తామంతా జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని నిర్ణయం తీసుకున్నామని దండకారణ్యం స్పెషల్ జోన్ సభ్యుడు ఎర్రా తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లో ఉద్యమాన్ని నడిపించడం కష్టమని పేర్కొన్నారు. మా ఆరోగ్య పరిస్థితులు కూడా సహకరించడం లేదని చెప్పారు. మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోవడం మంచిదని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యాల సాంబయ్య అలియాస్ ఆజాద్, అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్రా ఉన్నట్లు డీజీపీ తెలిపారు. మిగతా 34 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని పేర్కొన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 25 మంది మహిళలే ఉన్నట్లు తెలుస్తోంది. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, 9 మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు డీజీపీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు నగదుతోపాటు మరికొన్ని వెసులుబాట్లు కూడా కల్పిస్తామని చెప్పారు. ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాసి నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉందని డీజీపీ తెలిపారు. వీరితో పాటు లొంగిపోయిన మావోయిస్టులు అందరిపైనా కలిపి మొత్తం 1.41 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని వారికే అప్పగిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తామని తెలిపారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు ఉన్నారని.. వారు కూడా తొందరగా లొంగిపోవాలని పిలుపునిచ్చారు.

**నేడు భారత్ బంద్‌కు మావోయిస్టుల పిలుపు..**

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా ఎన్‌కౌంటర్‌కి నిరసనగా ఆదివారం దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తూ పార్టీ ప్రతినిధి అభయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన రాసిన లేఖలో.. నిరాయుధులైన హిడ్మా, అతడి భార్య రాజే సహా ఆరుగురు మావోయిస్టులను ఏపీ పోలీసులు విజయవాడలో అదుపులోకి తీసుకుని ఆ తరువాత మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో కాల్చి చంపి, దానిని ఎన్‌కౌంటర్‌గా చెప్పుకున్నారని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న హిడ్మా చికిత్స కోసం విజయవాడకు వచ్చారని, విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ఎస్ఐబీ పోలీసులు అతన్ని పట్టుకుని.. 15న అరెస్ట్ చేసి, 18వ తేదీన హిడ్మాను బుటకపు ఎన్ కౌంటర్ చేశారని మావోయిస్ట్ పార్టీ ప్రతినిధి అభయ్ ఆరోపించారు. అలాగే, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆదివాసీ సంఘం సీనియర్ నాయకుడు మనీష్ కుంజా కూడా ఈ ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండించారు. తాడిమెట్ల, జీరంఘాట్ ఘటనల్లో మాద్వి హిడ్మా ప్రమేయం లేదని పేర్కొన్నారు. ఆంధ్రాకు చెందిన కొంత మంది పార్టీకి చెందిన నాయకులే హిడ్మా కదలికలపై పోలీసులకు సమాచారం ఇచ్చారు.. ఈ ఎన్‌కౌంటర్‌లో దేవ్‌జీ పాత్ర ఉందని తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కాగా, ఈ ఎన్ కౌంటర్ ని వ్యతిరేకిస్తూ మావోయిస్టులు పెద్ద ఎత్తున నిరసనకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే భారత్ బంద్‌కి పిలుపునిచ్చిన నేపథ్యంలో పలుచోట్ల పోలీసు బందోబస్తు కట్టుదిట్టం చేశారు.

# సిఎం సీరియస్

(మొదటి పేజి (తరువాయి)

8 నెలల గర్భిణి మల్లేశ్వరి ప్రాణాలు కోల్పోయారు. మల్లేశ్వరికి పాంటాప్రోజోల్ అలెర్జీ ఉందని, హైపర్ టెన్షన్, డయాబెటిస్ కూడా ఉన్నాయని కేస్ షీట్లోనే నమోదు చేసినప్పటికీ, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా నవంబర్ 20న మధ్యాహ్నం పీజీ విద్యార్థిని పాంటాప్ ఇంజెక్షన్ ఇచ్చారు. దీనివల్ల పేషెంట్‌కు వెంటనే ఫిట్స్, అనంతరం కార్డియాక్ అరెస్ట్ తో రాత్రి 10 గంటల సమయంలో మరణించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఇందులో అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణా లోపం కూడా కారణమని తేలింది.అలాగే రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో నవంబర్ 8న 55 ఏళ్ల రోగికి అక్టోబర్ 2025 తేదీతో గడువు ముగిసిన మందులు ఇవ్వడంతో వాటిని వాడిన రోగి మరింత అనారోగ్యం పాలయ్యారు. ఈ రెండు సంఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. సంబంధిత వైద్య సిబ్బందిపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందిన గర్భిణీ కుటుంబానికి సాయం అందించాలని సీఎం అధికారులకు సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# యూనివర్సిటీలలో పోస్టులు భర్తీ

(మొదటి పేజి (తరువాయి)

దాదాపు 4200 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను పెండింగ్లో పెట్టిందని, ఆర్థిక వెసులుబాటు చూసుకొని దశలవారీగా పెండింగ్ నిధులను చెల్లిస్తామని మంత్రి లోకేష్ వెల్లడించారు.

కళాశాలల అడ్మిషన్ లపై లోకేష్ నిర్ణయం ఇదే సమయంలో కళాశాలలలో, యూనివర్సిటీలలో రాజకీయ ప్రసంగాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని నారా లోకేష్ స్పష్టం చేశారు. కళాశాలల నుండి నిర్వహించే యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్ లకు విద్యార్థిసంఘాలు సహకరించాలని ఆయన కోరారు. ఈసారి కళాశాలలో అడ్మిషన్లు ఆలస్యం కాకుండా తగినచర్యలు చేపడతామని, వచ్చే ఏడాది కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ల షెడ్యూల్ ను ఈ ఏడాదే ప్రకటిస్తామని షెడ్యూల్ ప్రకారమే టెస్టులను నిర్వహిస్తామని లోకేష్ తెలిపారు. ఇక యూనివర్సిటీలలో మిగిలిపోయిన సీట్లకు నేరుగా అడ్మిషన్లు కల్పించాలని విద్యార్థి సంఘం నేతలు కోరగా, బేసిక్ ఎగ్జామినేషన్ పాస్ కావాల్సిందేనని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న 4300 అధ్యాపక పోస్టులను త్వరలోనే భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పోస్టుల భర్తీ విషయంలో ఉన్న న్యాయపరమైన చిక్కులను తొలగించి భర్తీ చేస్తామన్నారు.హాస్టల్స్ లో సిబ్బందిని కూడా భర్తీ చేస్తామని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, కమాటి, వాచ్మెన్ పోస్టులను భక్తి చేస్తామని నారా లోకేష్ వెల్లడించారు. యూనివర్సిటీలు కళాశాలలలో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలని మంత్రి నారా లోకేష్ ను విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నాయకులు కోరగా అందుకు లోకేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

# అల్పపీడనం

(మొదటి పేజి (తరువాయి)

అవకాశం ఉంది. నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప, జిల్లాల్లో తేలికపాటి వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.ఇటీవల మొంథా తుఫాను కారణంగా భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. అనేక జిల్లాల్లో వర్ష బీభత్సం కొనసాగింది. ఆ పరిస్థితులను నుంచి ప్రజలు కోలుకుంటున్న తరుణంలో మరోసారి వర్షాలు ఏపీని ముంచెత్తనున్నాయి. ఉపరితల ఆవర్తన ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది పశ్చిమ – వాయవ్య దిశగా కదులుతూ ఈనెల 24 సోమవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఆ తరువాత 48 గంటల్లో పశ్చిమ – వాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో ఈనెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షాలు రానున్న నేపథ్యంలో రైతులకు విపత్తుల నిర్వహణ సంస్థ పలు


ముఖ్య సూచనలు చేసింది. ప్రస్తుతం వరి కోతలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో రైతులు వెంటనే కుప్పలు వేసుకోవాలని తెలిపింది. పండిన ధాన్యాన్ని వర్షంలో తడవకుండా సురక్షితంగా భద్రపరచుకోవాలని సూచించింది. ధాన్యం తడిసి రంగు మారకుండా ఉండేందుకు పూర్తిగా పట్టాలతో కప్పి ఉంచాలని పేర్కొంది. తడిసిన గింజలు మొలకెత్తకుండా, నాణ్యత కోల్పోకుండా జాగ్రత్త పడాలని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ సూచనలు చేసింది.

# విచారణలో రవి మౌనం

(మొదటి పేజి (తరువాయి)

సహాయంతో హార్డ్‌డిస్కులు, పెన్ డ్రైవ్‌లను పోలీసులు ఓపెన్ చేస్తున్నారు. ఫ్రాన్స్, నెదర్లాండ్‌లో మెయిన్ సర్వర్లు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. బ్యాంక్ ఖాతాల విషయంలోనూ రవి నోరువిప్పలేదని.. రవి అకౌంట్ల వివరాలు ఇవ్వాలని పలు బ్యాంకులకు పోలీసులు మెయిల్ పంపారు. ప్రతీరోజూ 20 రోజులకు ఒక్కో దేశానికి రవి వెళ్లాడని.. దీనిపై ప్రశ్నిస్తే తనకు విదేశీ పర్యటనలంటే ఇష్టమని.. అందుకే వెళ్లాలని రవి చెప్పినట్లు తెలియవచ్చింది. రవి పర్యటించిన దేశాల్లో పైరసీ లింకుల కూపీ లాగుతున్నారు పోలీసులు.

# సిబిఐ కోర్టు వీడియోలు



(మొదటి పేజి (తరువాయి)

కోసం కార్యకర్తలు, అభిమానులు వచ్చినా పచ్చ బ్యాచ్ తట్టుకోలేక పోతోంది. హైదరాబాదు సిబిఐ కోర్టుకు జగన్ వెళ్తే బల ప్రదర్శన అంటూ ఎల్లోమీడియా దుష్ప్రచారం చేసింది. ఎల్లోమీడియా, సోషల్ మీడియాపై కేసులు పెట్టాలి. దీనిపై కోర్టు సుమోటోగా కేసు నమోదు చేయించాలి. చివరికి కోర్టు ప్రొసీడింగ్స్ ను కూడా దొంగతనంగా చిత్రీకరిస్తారా?. చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు మేము కూడా వీడియో తీయించవచ్చు. కానీ అలాంటి దుర్మార్గపు పనులు మేము చేయలేదు. జగన్కు వచ్చినట్టు చంద్రబాబు, లోకేష్కు ఏనాడూ జనం రారు. ఏ రాష్ట్రం వెళ్లినా జగన్కు అభిమానులు ఉన్నారు.విజయవాడలో ఒక్కడే బైకు మీద వెళ్లినా జనం తండోపతండాలుగా వస్తారు. అదంతా జగన్ మీద ఉన్న అభిమానం. జగన్ తన సొంత డబ్బుతో విమాన ఖర్చు పెట్టుకున్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ తిరుగుతున్న స్పెషల్ ఫ్లైట్ల ఖర్చు ఎవరిది?. ప్రజా సొమ్ముతోనే వారు ప్రత్యేక విమానాల్లో తిరుగుతున్నారు. చివరికి లండన్ వెళ్లినా ప్రభుత్వ సొమ్మునే ఖర్చు చేశారు. ప్రజా సొమ్ముతో విలాసాలు చేయటంలో చంద్రబాబుకు మించిన వారు లేరు అంటూ ఘాటు విమర్శలు చేశారు.

## 26న పాపంపల్లిలో శ్రీ కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ట

**ఆత్మకూరు, నవంబర్ 22:**
మండల పరిధిలోని పాపంపల్లి గ్రామంలో రేనాటి రోశమ్మ వారి తోటలో ఈనెల 26 ఉదయం 9 గం.27 ని.లకు శ్రీ కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్వీకుల నుంచి పూజలు అందుకుంటున్న కాలభైరవ స్వామికి నూతనంగా అరుగు నిర్మించి రాతి స్తంభాలతో చిన్నపాటి మంటపం నిర్మించారు. సోమవారం మంగళవారాలలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి బుధవారం ప్రతిష్ట చేయనున్నట్లు రేనాటి కుటుంబీకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.


శ్రీ కాలభైరవ స్వామి మూర్తి


పాపంపల్లిలో శ్రీ కాలభైరవుడు కొలువుతీరనున్న మంటపం

## శ్రీరాముని విగ్రహం వెండి తొడుగుకు కిలో వెండి వితరణ

### జెడ్పిటిసి పద్మావతి కుటుంబం దాతృత్వం..

**కనేకల్ నవంబర్ 22:**
మండల కేంద్రంలోని తారక రామ్ నగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారాముల ఆలయానికి కిలో వెండి ఇప్పిస్తామని జెడ్పిటిసి కుటుంబ సభ్యులు మరెంపల్లి తిమ్మప్ప, ధర్మపత్ని జెడ్పిటిసి పద్మావతి పెద్ద కుమార్తె సుజాత మాట ఇచ్చారు. అందుకు ముందస్తుగా 50 వేల రూపాయలు ఆలయ కమిటీ పెద్దలు మారంపల్లి నాగప్ప,శేషారెడ్డి, బద్రి నారాయణకు శనివారం అందించారు. మిగిలిన పైకాన్ని త్వరలో అందజేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.


వెండి కోసం రూ. 50 వేల విరాళం అందిస్తున్న దాతలు

## 3 నెలలకు ఒకసారి జాబ్ కార్డ్ పునఃపరిశీలన

### ఉపాధిహామీపై గ్రామసభ.. ఏపీవో మురళీకృష్ణ..

**బెళుగుప్ప నవంబర్ 22:**
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి కూలీల జాబ్ కార్డ్ కున పరిశీలన జరుగుతుందని ఏపీవో మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన బెళుగుప్ప వన్నూరు స్వామి కట్ట వద్ద ఉపాధి హామీ పథకం పై గ్రామ సభను నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీవో మురళీకృష్ణ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం మూడు నెలలకు ఒకసారి జాబ్ కార్డ్ పున పరిశీలన నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జాబ్ కార్డు పొందిన వారిలో ఎవరైనా చనిపోతే ప్రభుత్వ ఉద్యోగులు అయితే శాశ్వతంగా గ్రామం వదిలి వెళ్ళిన వారిని తొలగించి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. 18 సంవత్సరాలు పైబడిన వారు దరఖాస్తు ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో మురళీకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ అవినాష్,యఫ్ఏ ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు...


ఉపాధిహామీ గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీవో మురళీకృష్ణ..

## ఆల్ ది బెస్ట్ అనిల్

### మాక్ అసెంబ్లీకి వెళ్తున్న విద్యార్థి... అభినందించిన ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి..

**యాడికి, నవంబర్ 22 :**
యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుతున్న పదవ తరగతి విద్యార్థి అనిల్ కుమార్ నియోజవర్గం నుండి మాక్ అసెంబ్లీకి ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి శనివారం వీడియో కాల్ ద్వారా అభినందించారు. విద్యార్థి దశలోనే ప్రతిభ చూపి అందులో నియోజక వర్గం నుండి యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అనిల్ కుమార్ మాక్ అసెంబ్లీకి వెళ్లడం గర్వకారణమన్నారు. తాను తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టినప్పుడు కన్నీళ్లు వచ్చాయని గుర్తుచేసుకున్నారు. అనిల్ కుమార్ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆల్ ది బెస్ట్ అనిల్ కుమార్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కాశప్ప, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సీతారామాంజనేయులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.


విద్యార్థి అనిల్ కుమార్‌కు వీడియో కాల్‌లో ఆల్ ది బెస్ట్ చెబుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

## లాకప్ డెత్ చేసిన డీఎస్పీ చైతన్యపై చర్యలు తీసుకోవాలి

### టీడీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్షావలి.. కౌన్సిలర్ మల్లికార్జున..

**తాడిపత్రి, నవంబర్ 22:**
తెలుగు దేశం పార్టీ కార్యకర్త నారాయణను తాడిపత్రిలో లాకప్ డెత్ చేసిన నాటి డీఎస్పీ చైతన్యపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ మునిసిపల్ వైస్ చైర్మన్ షేక్షావలి, కౌన్సిలర్ మల్లికార్జున, కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్షావలి, కౌన్సిలర్ మల్లికార్జున మాట్లాడుతూ 2021 సంవత్సరంలో పెద్దపప్పూరు మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త నారాయణని పొలం గట్టు తగాదా విషయంలో అప్పటి పెద్దపప్పూరు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గౌస్ బలవంతంగా నారాయణను తాడిపత్రి డీఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లాడని తెలిపారు. తాడిపత్రి డీఎస్పీ కార్యాలయంలో అప్పటి డీఎస్పీ చైతన్య మరియు ఎస్ఐ గౌస్ విపరీతంగా కొట్టడం వలన దెబ్బలకు తాళలేక నారాయణ స్పృహ తప్పి పడిపోవడం తో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి పోలీస్ వారు తరలించడం జరిగిందన్నారు. కొద్దిసేపటి తరువాత నారాయణ మరణించాడని తెలిపారు.
నారాయణ మృతి చెందాక ఎస్ఐ గౌస్ నారాయణ కుటుంబానికి చెందిన వారిని ప్రలోభలకు గురి చేస్తూ 5 లక్షల రూపాయల నగదు, 5 ఎకరాల ప్రభుత్వ భూమి, మృతి చెందిన నారాయణ కుమారునికి హోమ్ గార్డ్ గా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పడం జరిగిందన్నారు. కానీ ఎస్ఐ గౌస్, డీఎస్పీ చైతన్యలు నారాయణ కుటుంబానికి ఏ సహాయం చేయకుండా, నారాయణ మృత దేహాన్ని అంత్యక్రియలు పూర్తి అయిన తరువాత ఎస్ఐ గౌస్ బాధిత కుటుంబాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. నారాయణ మృతి చెందడానికి ఎస్ఐ గౌస్, డీఎస్పీ చైతన్యలే ప్రధాన కారణమని నారాయణ భార్య వెంకట లక్ష్మి, కుటుంబ సభ్యులు ఈనెల 21న సోమనపల్లి గ్రామంలో మీడియాకు తెలిపారన్నారు. ఎస్ఐ గౌస్ గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పెద్ద పప్పూరు ఎస్ఐగా, తాడిపత్రి రూరల్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి తొత్తుగా వ్యవహరిస్తూ, అనేకమంది తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసి, అరాచకం సృష్టించాడని ఆరోపించారు. నారాయణ భార్య వెంకట లక్ష్మి, శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డికి జరిగిన విషయం వినతిపత్రం ఇచ్చారన్నారు. దాని ఆధారంగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ముఖ్యమంత్రి, హోమ్ మినిస్టర్, డీజీపీకి ఫిర్యాదు చేశారన్నారు. అసెంబ్లీ సమావేశంలో నారాయణ లాకప్ డెత్ గురించి ప్రస్తావించారన్నారు. నారాయణ లాకప్ డెత్ విషయాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకొని అనంతపురం డీఎస్పీ శ్రీనివాస రావుని ప్రత్యేక అధికారిగా నియమించారన్నారు. ఈనెల 21న డీఎస్పీ శ్రీనివాసరావు సోమనపల్లే గ్రామానికి వచ్చి విచారణ మొదలు పెట్టారని తెలిపారు.
ఈ విచారణ మొదలు పెట్టగానే శింగనమల నియోజకవర్గం గార్లదిన్నెలో ప్రస్తుతం పనిచేస్తున్న ఎస్ఐ గౌస్ నారాయణ కుటుంబానికి చెందిన సాక్షులను బెదిరిస్తున్నాడని, నా పేరును మీరు మీడియా ముఖంగా చెప్తున్నారని, రాబోయే కాలంలో నేను అక్కడకి సీఐగా వస్తానని, మిమ్మల్ని అక్రమ కేసుల్లో ఇరికిస్తానని బెదిరిస్తున్నాడని తెలిపారు. ఈ బెదిరింపుల వలన నారాయణ కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. గార్లదిన్నేలో పనిచేస్తున్న ఎస్ఐ గౌస్ విధి నిర్వహణలో ఉంటే సాక్షులను బెదిరించి విచారణ తప్పుదోవ పట్టించే అవకాశం ఉన్నందున, వెంటనే జిల్లా ఎస్పీ, డీఐజీలు ఎస్ఐ గౌస్ ను వీఆర్ కి తీసుకొనవలసిందిగా కోరుతున్నామన్నారు. విచారణ ముగిసిన తరువాత ఎస్ఐ గౌస్ ని సస్పెండ్ చేయవలసిందిగా కోరుతున్నాము, ఎస్ఐ గౌస్ ని వీఆర్ కు తీసుకోని పక్షంలో ఒక వారం రోజుల్లో తాడిపత్రి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిల్ సభ్యులు, మృతుడు నారాయణ భార్య వెంకట లక్ష్మి, కుటుంబ సభ్యులతో సహ గార్లదిన్నే పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు.


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ షేక్షావలి, కౌన్సిలర్ మల్లికార్జున

## స్మార్ట్ కిచెన్ సెంటర్ల ఏర్పాటును తక్షణమే విరమించుకోవాలి

**గుత్తి, నవంబర్ 22:**
రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ కిచెన్ సెంటర్ల ఏర్పాటును తక్షణమే విరమించుకోవాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగమణి , సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, యూనియన్ జిల్లా కోశాధికారి సరస్వతి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ప్రమీల డిమాండ్ చేశారు. గుత్తి పట్టణంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశం జరిగింది డొక్కా సీతమ్మ బడి భోజనం పథకాన్ని నిర్వీర్యం చేసి విద్యార్థులు కార్మికులు పొట్ట కొట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందన్నారు. ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడం వల్ల స్మార్ట్ కిచెన్‌లో ఒకచోట వంట చేసి ఇతర ప్రాంతాలకు బాక్సుల్లో వాహనాల ద్వారా పంపించడం వల్ల వేడివేడి భోజనానికి పిల్లలు దూరం అవుతారన్నారు. ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడం వల్ల 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోతారన్నారు.
ఇప్పటికే అక్షయపాత్ర, ఇస్కాన్ సంస్థలు చోట పిల్లలకు టైం కి అందక. ఆహారం కూడా పాడవడంతో పిల్లలు అర్ధకలితో ఇబ్బందులకు గురవుతున్నారు కార్మికులైతే టైం కి వేడి వేడి భోజనం వండి పిల్లలకు పెడతారు పోషకాలు కూడా అందుతాయి పిల్లలను కార్మికులను కలిగించే స్మార్ట్ కిచెన్ లో ఏర్పాటు చేయాలని ఆలోచన ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి కార్మికులకు వేతనాలు పెంచాలి పిల్లలకి ఇచ్చే మెనూ ఛార్జింగ్ పెంచాలి వంట షెడ్లు ఏర్పాటు చేయాలి ఈ ప్రయత్నాలు విరమించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు భారతి లక్ష్మీదేవి రామేశ్వరమ్మ మంజుల తదితరులు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీల జిల్లా నాయకురాళ్లు

## అరటి మార్కెట్ ధర పై రాష్ట్రస్థాయి సమావేశం

**పుట్టపర్తి, నవంబర్ 22:**
అరటి పంట మార్కెట్ విషయంలో వచ్చిన సంక్షోభం మీద రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ అన్ని దళారి కంపెనీ ప్రతినిధులతో అంతర్జాల సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాలొన్నారు. అరటిలో నాణ్యత ఉన్న పంట రూ. 7.50 నుంచి రూ.8.00 రైతుల నుండి తీసుకుంటున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలపడం జరిగినది. నాణ్యత లేని అరటి పంటకు లోకల్ ట్రేడర్స్ తక్కువ ధరకు తీసుకుంటున్నారన్నారు. దీంతో డైరెక్టర్ అన్ని జిల్లాల ఉద్యాన అధికారులకు ఆదేశాలిస్తూ ప్రతి ఒక్క రైతు ఫ్రూట్ కేర్ యాక్టివిటీ అవలంబించినట్లయితే నాణ్యత పెరిగి మార్కెట్లో మంచి ధర రావడానికి అవకాశం ఉందన్నారు.

## ఘనంగా శ్రీ భక్త కనకదాస జయంతి

### గ్రామంలో శ్రీ భక్త కనకదాస గ్రామోత్సవం..

**బెళుగుప్ప, నవంబర్ 22:**
బెళుగుప్ప మండల పరిధిలోని కాలువపల్లి గ్రామంలో శనివారం కురుబ సంఘం ఆధ్వర్యంలో కురుబల ఆరాధ్య దైవమైన శ్రీ భక్త కనకదాస జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కనకదాస దేవాలయంలోని భక్త కనకదాస విగ్రహానికి ఉదయం నుండి కురుబ సోదరులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమం నిర్వహించి పూలమాలలు వేసి పూజాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా పూలతో అలంకరించిన ట్రాక్టర్ లో శ్రీ కనకదాస ఉత్సవ విగ్రహాన్ని ఉంచి వాహనం ముందు మహిళలు చిన్నారులు, హారతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. గోరవయ్యాల నృత్యాలతో డప్పు కొట్టే కళాకారులతో విన్యాసాలతో, యువత స్టెప్పులతో ,గ్రామోత్సవం నిర్వహించారు. అన్నదాన వితరణ చేశారు.


శ్రీ భక్త కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి


శ్రీ భక్త కనకదాసు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

## 30లోపు ఇండ్లు, ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

### తహసిల్దార్ ప్రతాపరెడ్డి..

**యాడికి, నవంబర్ 22 :**
యాడికి మండలంలో అర్హులైన వారు ఇళ్ల కోసం, ఇంటి స్థలాల కోసం ఈనెల 30వ తేదీ లోపు సంబంధిత సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని. మూడు దశల వెరిఫికేషన్ తర్వాత అర్హులకు ఇళ్ళు, ఇంటి స్థలాలు మంజూరు చేస్తారని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, హౌసింగ్ ఏఈ లోకేష్ కుమార్ తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్థలం కలిగియుండి లబ్దిదారుల పేరు మీద పట్టా /రిజిస్టర్డ్ డాక్యుమెంట్ / పోసెషన్ సర్టిఫికెట్ ఉన్న వారు ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం కింద ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో యాప్‌లో సర్వే చేపించుకోవాలన్నారు.
ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ శశికళ, హౌసింగ్ ఏఈ లోకేష్ కుమార్ . టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ యాదవ్. నాయకులు రంగయ్య. పంచాయితీ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, పంచాయతీ సెక్రెటరీస్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న తహసిల్దార్ ప్రతాపరెడ్డి. డిప్యూటీ

## అగాపే వృద్ధాశ్రమంలో ఉచిత నేత్ర వైద్య సేవలు

**యాడికి, నవంబర్ 22:**
యాడికి మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే వృద్ధాశ్రమం లో శనివారం విశ్రాంత ప్రభుత్వ నేత్ర వైద్యాధికారి గాదిరాజు మధుసూదన రాజు, చొక్కరాజు సునీత దంపతులు నేత్ర వైద్యసేవలు అందించారు. వృద్ధులకు ఉచితకంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత కంటి అద్దాలు అందించారు. అగాపే వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు రెవ.సాలమన్ ఆయన సతీమణి ఏమీమా కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేశారు.స్థానిక అమీనా కంటి అద్దాల షాప్ యజమాని సయ్యద్ వలి సహకరించారు.





అగాపే ఆశ్రమంలో కంటి అద్దాలు అందిస్తున్న విశ్రాంత ప్రభుత్వ నేత్ర వైద్య అధికారి మధుసూదన్ రాజు, సునీత దంపతులు

## టిడిపి మండల కన్వీనర్ వన్నారెడ్డికు సన్మానం

### మండలం ఎన్‌డిఎ నాయకులు ..

**కనేకల్, నవంబర్ 22 :**
నూతనంగా కనేకల్ టిడిపి కన్వీనర్‌గా ఎన్నికైన అక్కిరెడ్డిగారి వన్నారెడ్డిని మండల కూటమి నాయకులు శనివారం సన్మానించారు. మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో అతని నివాసంలో కూటమినేతలు మండల బిజెపి అధ్యక్షుడు కురబ తిప్పేస్వామి, రచ్చుమర్రి టీడీపీ సర్పంచ్ రుద్రముని, స్టోర్ డీలర్ వస్కెరప్ప, టీడీపీ సీనియర్ నాయకుడు విరుపాక్షి,కోరి తిమ్మప్ప కలుసుకొని శాలువాలతో, పూలమాలతో కనేకల్ టిడిపి నూతన కన్వీనర్ గా ఎన్నికైనందుకు వన్నారెడ్డిని అభినందిస్తూ వారి అభిమానాన్ని చాటుకున్నారు.


మండల టిడిపి కన్వీనర్ వన్నారెడ్డిని కలుసుకున్న కూటమి నేతలు

## అన్నదాత ఆక్రందన.. పట్టించుకోని ప్రభుత్వం..

అన్నదాతల ఆక్రందన పట్ల రాష్ట్ర ప్రభుత్వం చెవిటి,మూగ, గుడ్డి దానిలా ప్రవర్తిస్తూ, అన్నదాత సుఖీభవ కింద ఒక సంవత్సరం ఎగ్గొట్టి, ప్రస్తుతం 20,000 ఇస్తామని చెప్పి, 17000కు కుదించి ఇస్తూ ఇదే రైతుల అన్ని సమస్యలకు పరిష్కారం అని అరచేయిని చూపించి మోచేతిని నాకిస్తున్నది.
2025-26 ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టితో రైతులు ఆర్థిక సంక్షోభంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రోడ్డెక్కు తున్నారు, పొలం లోనే పంటను వదిలేస్తున్నారు. అన్న దాతల కష్టాలను తీర్చే ప్రయత్నం ఈ ప్రభుత్వం ఏ మాత్రం చేయడం లేదు.
ఖరీఫ్‌లో రాయలసీమ లో ప్రధాన పంట వేరుశనగ సాగు సంక్షోభం, ఉల్లి,సజ్జ,మొక్కజొన్న,పత్తి, అమ్మకాలు సంక్షోభం. రాయల సీమ హార్టికల్చర్ హబ్.పండ్లు,కూరగాయలు, పూల ఉత్పత్తిలో అగ్రస్తానం.
రాష్ట్రం మొత్తం అన్ని రకాల పండ్ల ఉత్పత్తి 213 లక్షల టన్నులు అయితే,ఇందులో అరటి ఒక్కటే 74లక్షల టన్నులు.ఇందులో ప్రధాన ఉత్పత్తి రాయలసీమ జిల్లాలలోనే ప్రత్యేకంగా జి-9 అరటి ఉత్పత్తిలో అత్యంత వెనుకబడిన,అనంతపురం,కడప,అన్నమయ్య,సత్యసాయి జిల్లాలదే అగ్ర స్థానం.ప్రస్తుతం అరటి ధరలు క్వింటాలు 200 నుండి 300 రూ"కు పడిపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు.
ఉల్లి రైతు ట్రక్కులతో ఉల్లిపాయలు పారబోయటం, పొలాల లోనే వదిలివేయటం, పంటను దున్నివేయటం చూసాం.నేడు అరటి రైతు గెలలను పారబోయటం,అరటి తోటను ట్రాక్టర్ తో దున్ని వేయడం చూస్తున్నాం. కష్టపడి సాగు చేసిన పొలాన్ని,ప్రేమతో పెంచుకున్న పంటను పారవేస్తూ రైతు మానసిక క్షోభను అనుభవిస్తున్నాడు. ఈ సంక్షోభం నుండి కాపాడమని వేడుకుంటున్నారు. మన కళ్ల ముందే ఇలా జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం తప్ప ఏమీ చెయ్యలేని పరిస్థితి.
రాష్ట్ర వ్యాప్తంగా అరటి తొమ్మిది జిల్లాలలో సాగవుతుంది,సుమారు 50 లక్షల టన్నుల పంట దిగుబడి ఉండి,అనేక రాష్ట్రాలకు ప్రత్యేకంగా దేశ రాజ ధాని ఢిల్లీకి ఎంతో ఆరోగ్య కరమైన పండును అందిస్తూ పెట్టు బడి కూడా రాని ధరకు అమ్ముకుంటున్నారు.అరటి సాగుకు పెట్టుబడి కూడా ఎక్కువే.
అనంతపురం నుండి శ్రీకాకుళం వరకూ ప్రతి రైతు సంక్షోభమే.ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం తప్ప.ఇంత వరకూ ఏ పంట పండించిన రైతునూ ఆదుకున్న దాఖలాలు లేవు. చివరికి గత వైసీపీ ప్రభుత్వంలో వలె ఉచిత ఇన్సూరెన్స్ లేదు,ఇన్పుట్ సబ్సిడీ కూడా లేకుండా చేసి రైతుల పట్ల అతి కఠోరంగా ప్రవర్తిస్తున్న ఈ ప్రభుత్వానికి పతనం ఎంతో దూరం లేదు.

**- కెవి రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక, అనంతపురం.**



# అరటి మార్కెట్‌పై నిరంతరం పర్యవేక్షణ

## రైల్వే వ్యాగన్ల ద్వారా ముంబై, కోల్‌కత్తా మార్కెట్లకు తరలించండి.. పత్తి, మొక్కజొన్న రైతుల్ని ఆదుకోవాలని కేంద్రానికి ముఖ్యమంత్రి లేఖ ..

**పుట్టపర్తి, నవంబర్ 22:**
రాయలసీమలో పండిన అరటిని ముంబై లాంటి మార్కెట్ లకు తరలించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ముంబై, కలకత్తా లాంటి ప్రాంతాలకు తరలించి అక్కడి మార్కెట్లలో విక్రయించాలని సూచించారు. అరటి ధరలు, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అధికారులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. అరటి ధరలు, కొనుగోళ్లపై ప్రతీ రోజూ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహారాష్ట్ర లాంటి ప్రాంతాల్లో ఉన్న మార్కెట్లకు అరటి లోడుతో కూడిన రైల్వే వ్యాగన్లను పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రాయలసీమలో 40 వేల హెక్టార్లలో అరటి ఉత్పత్తి అవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. డిసెంబరు మొదటి వారం నుంచి అరటి ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే అప్పటి వరకూ అరటి రైతులు నష్టపోకుండా తక్షణం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రాయలసీమలో పండిన అరటిని రవాణా చేసేందుకు ఓ ఏజెన్సీ ముందుకు వచ్చిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎప్పటికప్పుడు అరటిని రవాణా చేసేందుకు ఓ ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. మొక్క జొన్న రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలిచ్చారు. మొక్క జొన్న మద్దతు ధర కంటే తక్కువ రేటు పలుతున్నందున వ్యత్యాసాన్ని ధరల స్థిరీకరణ నిధి ద్వారా చెల్లించే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఈసారి 1.42 లక్షల హెక్టార్లలో మొక్కజొన్న సాగైందని 8.18 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 2.04 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్నను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సీఎం సూచించారు. ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయించేందుకు ప్రయోగాత్మకంగా కొనుగోళ్లు చేపట్టాలని పేర్కొన్నారు. అది సత్ఫలితాలు ఇస్తే మొక్క జొన్న కొనుగోళ్లకు సమస్య ఎదురైనప్పుడు దానిని ఆచరించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

**పత్తి కొనుగోళ్లపై కేంద్రానికి లేఖ**
పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రతీ రోజూ తనిఖీ చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు రైతులతో మాట్లాడి సమస్యల్ని పరిష్కరించాలని సూచించారు. రంగుమారిన, తడిచిన పత్తిని కూడా కొనుగోలు చేసేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాగల రెండు మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాల్సిందిగా సీఎం అధికారులకు సూచించారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్లాట్ బుకింగ్ సమస్యను పరిష్కరించిందని అధికారులు వివరించారు.

# ఉప రాష్ట్రపతికి స్వాగతం

## ఎమ్మెల్యే ఎంఎస్ రాజు..

**అగళి, నవంబర్ 22 :**
భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణకిమడకశిర శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు ఎంఎస్ రాజు స్వాగతం పలికారు.



# ఉపకారాగారం తనిఖీ

## ఖైదీల్లో మార్పు రావాలి.. సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ ..

**హిందూపురం, నవంబర్ 22 :**
స్థానిక ఉపకారాగారాన్ని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ శనివారం తనిఖీ చే %జ%శారు. ఈ సందర్భంగా ఉపకారాగారంలో ఉన్న ఖైదీల వివరాలు, ఎప్పటి నుండి ఉంటున్నారు, ఎలాంటి నేరాలు చేసి ఉపకారాగారానికి వచ్చారు అన్న వివరాలను ఉపకారాగార అధికారి హనుమప్పతో అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా న్యాయాధికారి మాట్లాడుతూ, క్షణికావేశంలో తప్పులు చేసి కారాగారాలకు రావడం వల్ల కుటుంబ గౌరవ మర్యాదలు దెబ్బతింటాయన్నారు. అదే విధంగా ఆయా కుటుంబాలను సమాజంలో కూడా చిన్న చూపు చూడబడతారని తెలిపారు. దీనికి తోడు ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందని తెలిపారు. చేసిన తప్పులే మళ్ళీ చేసి జైళ్లకు రావడం వల్ల పోలీసు రికార్డుల్లో శాశ్వత నేరగాళ్లుగా ఉంటారని తెలిపారు. ఉప కారాగారం నుండి మార్పు మొదలు కావాలని సూచించారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని నిందితులు ఉంటే దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపకారాగారంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి



ఖైదీలకు సూచనలు చేస్తున్న న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్

తీసుకురావాలని న్యాయమూర్తి సూచించారు. బెయిల్ మంజూరైన తర్వాత జామీన్ దారులను ఏర్పాటు చేసుకునే బాధ్యత మీ మీదే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజశేఖర్, నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, రాజు, పారా లీగల్ వాలంటీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

## వామపక్ష కార్మిక నాయకుల నిరసన..

**బత్తలపల్లి, నవంబర్ 22:**
కార్మికులకు వ్యతిరేకంగా రూపొందించిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, మండల కేంద్రమైన బత్తలపల్లిలో శనివారం వామపక్ష కార్మిక సంఘాలు సిపిఐ,సిఐటీయు, సిపిఎం,ఏఐటీయుసిల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు దిల్షాద్, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ కోట్స్ కార్మికుల హక్కులను, ప్రయోజనాలను కాలరాసే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సాధించుకున్న చట్టాలను సైతం నిర్వీర్యం చేసేలా ఈ కొత్త కోడ్స్ ఉన్నాయని ఆరోపించారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న చట్టాలను రద్దు చేసి,కార్మిక సంక్షేమానికి ఉపయోగపడే నూతన చట్టాలను తక్షణమే రూపొందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికుల హక్కులను, భద్రతను కాపాడాలని ?నిరసన వ్యక్తం చేస్తూ, వామపక్షాల సంయుక్తంగా నాయకులు కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న లేబర్ కోడ్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, సిపిఐ బత్తలపల్లి మండల కార్యదర్శి బండల వెంకటేష్, సిపిఐ పార్టీ ముదిగుబ్బ మండల కార్యదర్శి



లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష కార్మిక నాయకులు

చల్లా శ్రీనివాసులు, పార్టీ బత్తలపల్లి మండల సహాయ కార్యదర్శి గోగుల చిన్న పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులునాగభూషణ, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.?అలాగే, సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, నరసింహులు, పెద్దన్న, భాష, నల్లప్ప, రాందాసు, బండారు నారాయణ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్. వలస పంచాయితీ కార్యాలయంలో అర్జీలు అందజేస్తున్న కూలీలు.

# ఉపాధి హామీ జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

**అమరాపురం, నవంబర్ 22:**
అమరాపురం మండలంలోని 11 గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామారావు మరియు ఏపీవో శివన్న లు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పని చేయడానికి జాబ్ కార్డు లేని వారు జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా జాబ్ కార్డు ఉన్న పని చేయక రద్దయిన వారు వాటి స్థానంలో పు: వెరిఫికేషన్ (రెన్యువల్) చేసుకోవాలన్నారు. వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి ఆవాజ్ యువజన పథకం క్రింద ఇండ్లు మంజూరు చేసిందని ఇండ్లు మంజూరు అయినా లబ్ధిదారులు తప్పకుండా జాబ్ కార్డులు చేయించు కోవాలని వారు తెలిపారు. కూలీలు అధికారులకు అర్జీలను అందజేశారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు, ఏపీవో శివన్న, పంచాయతీ కార్యదర్శులు యోగా నంద, వీర కరియప్ప, ఈరన్న, నరేష్ బాబు, టి ఏ ఈరన్న , వలస సర్పంచ్ హితేంద్ర, తెదేపా నాయకులు నాగోనపల్లి మంజునాథ్, తమ్ముడే పల్లి శివలింగప్ప, నాగోనపల్లి సిద్దేశ్వర ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రదీప్, దేవరాజ్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.






తమదేపల్లి పంచాయితీ కార్యాలయం వద్ద కార్యదర్శి యోగానందకు అర్జీలు అందజేస్తున్న కూలీలు . సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

# ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

## ఎపిఓ ఓబుళప్ప ..

**రోళ్ల, నవంబర్ 22 :**
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎపిఓ ఓబుళప్ప తెలిపారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీలో శనివారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలోని జాబ్ కార్డు కలిగిన శ్రామికులతో అన్ని గ్రామాలలో జాబ్ కార్డులపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి జాబ్ కార్డ్ కోసం కొత్తగా దరఖాస్తులు చేసుకోవాలని అలాగే ఉపాధి హామీ పనుల కోసం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాలల్లో నీటి కుంటలు పనులను ప్రారంభిస్తున్నట్లు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లోని జాబ్ కార్డు కలిగిన ఉపాధి శ్రామికుల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అదేవిదంగా గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ప్రజా ప్రతినిధులు ఈ సి వెంకటేష్ టెక్నికల్ అసిస్టెంట్లు మారేగౌడ్, స్వాతి, నగేష్, అనిల్ ఫీల్డ్ అసిస్టెంట్లు మురళి,మూర్తి, యంజారప్ప, తిమ్మారెడ్డి, చంద్ర, మంజునాథ్, కృష్ణ, రాజన్న, ఉదయ్ కుమార్, మంజునాథ్, ఉమేష్,ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఓ ఓబుళప్ప

# ఉపాధి గ్రామసభలు విజయవంతం

## ఎపిఓ మంజునాథ్

**అగళి, నవంబర్ 22 :**
పంచాయతీరాజ్ కమిషనర్,గ్రామీణ అభివృద్ధి శాఖ వారి ఆదేశాలతో శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై గ్రామసభల షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని అన్ని పంచాయతీలలోని గ్రామ ప్రజలు ఈ సభలను విజయవంతం చేసారని ఎ పి ఓ మంజునాథ్ తెలిపారు. ఈసందర్భంగా జాబ్ కార్డ్ ఈ కేవైసీ,ఇంకా జరగని వాటి గురించి చర్చించారు. అదేవిధంగా ఆయా గ్రామంలో గుర్తించిన పనుల గురించి కూడా చర్చించారు. గ్రామాలలోని ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్న శ్రామికులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేస్తూ పనులు చేయడానికి దరఖాస్తులు స్వీకరించారు.ప్రభుత్వ ఎన్టీఆర్ గృహ పథకం లబ్దిదారులు కొత్త జాబ్ కార్డు లేని వారు దరఖాస్తు చేసుకుంటే అర్హులైన వారికి వారం రోజుల లోపు మంజూరు చేస్తామన్నారు.జాబ్ కార్డులోని సభ్యులు ఎవరైనా మరణించి ఉంటే వారి పేరును క్యాన్సిల్ చేయించుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని సచివాలయాలలో జరిగిన గ్రామసభలలో కొత్త జాబ్ కార్డుల కోసం దాదాపు 300కు పైగా నమోదు చేసుకున్నారని మంజునాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది ఉపాధి హామీ కూలీలు సచివాలయ సిబ్బంది స్థానిక నాయకులు కార్యకర్తలు ఆయా గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీవో మంజునాథ్

# అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు పునరుద్ధరణ

**గుడిబండ, నవంబర్ 22 :**
జాతీయ గ్రామీణ మహాత్మా గాంధీ ఉపాధి పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు పునరుద్ధరిస్తామని ఉపాధి హామీ ఎపిఓ జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మాత్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ పి ఆర్ అండ్ ఆర్ డి జిల్లా సంచాలకులు వారి ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీలతో గ్రామసభలు నిర్వహించారు ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధి హామీ కూలీల ఈ కేవైసీ లో జాబ్ కార్డులు రద్దు చేయబడిన ఎడల వేతన దారుల నుండి అభ్యంతరాలనుస్వీకరించి వాటిని పరిశీలించి మళ్లీ జాబ్ కార్డులు అందిస్తామని వేతన శ్రామికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ గ్రామసభలో మండల వ్యాప్తంగా 251 దరఖాస్తులు వచ్చాయని అలాగే పనుల కోసం డిమాండ్లు స్వీకరించామన్నారు. సోమవారం నుండి ఫారం ఫండ్ పనులు ప్రారంభించాలని సిబ్బందికి సూచించారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో జగదీష్

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించండి

## ప్రధానోపాధ్యాయుడు బి. రవీంద్ర..

**అమరాపురం, నవంబర్ 22:**
ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ప్రధానోపాధ్యాయుడు బి. రవీంద్ర పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉన్నత పాఠశాల లో సబ్జెక్టుల కు బోధించు ఉపాధ్యాయుల కు కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు విద్యార్థుల స్థాయిని గుర్తించి బోధన చేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా రాబోవు మార్చ్ లో నిర్వహించే పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. అన్ని పాఠశాలలోను 100% ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం సబ్జెక్టుల వారిగా బోధన పద్ధతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హాజరైన ఉపాధ్యాయులు




సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర

# వైభవంగా శ్రీ ఆంజనేయ స్వామి రథోత్సవం

**పెద్దకడబూరు, నవంబర్ 22 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి రథోత్సవం శనివారం కన్నుల పండుగగా జరిగింది. కార్తీక పూజలలో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారికి జలాభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, బిల్వార్చన, పంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పూజా కార్యక్రమాలలో భాగంగా స్వామివారి రథాన్ని సుందరంగా అలంకరించారు. స్వామివారి రథానికి గజమాలలతో అలంకరించిన తర్వాత ఉత్సవమూర్తిని రథంపై ప్రతిష్టించి అశేష భక్తవాహిణి రథోత్సవం జరిగింది. రథోత్సవాన్ని పురస్కరించుకొని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్, వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మండల సభ్యులు పురుషోత్తం, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసీపీ బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి హాజరై శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బజారి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



శ్రీ ఆంజనేయ స్వామి రథోత్సవం జరుగుతున్న దృశ్యం



శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఈసీ ఖాదర్ బాషా

## 24 నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

### ఏపీవో చంద్రశేఖర్..

**పెద్దకడబూరు, నవంబర్ 22 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈ నెల 24 నుంచి సామాజిక తనిఖీ జరుగుతుందని ఏపీఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం పెద్దకడబూరులోని మండల పరిషత్ కార్యాలయం నందు ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ 1- 4 -2024 నుంచి 31-3-25 వరకు జరిగిన 973 ఉపాధి పనులను సంబంధించి సామాజిక తనిఖీ బృందం పరిశీలించడం జరుగుతుందన్నారు. ఉపాధి కూలీల వేతనాలకు సంబంధించి 7.08 కోట్లు, ఎన్ఆర్జీఎస్ కింద సీసీ రోడ్లు, సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల పనులకు సంబంధించి 2.21 కోట్లు మొత్తం 9.30 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. ఈ పనులను తనిఖీ చేయడానికి ముగ్గురు డీఆర్పీలు, ఒకరు ఎస్ఆర్పీ వచ్చినట్లు వెల్లడించారు. తనిఖీ బృందం ఈ నెల 24 నుంచి గ్రామాలకు వెళ్లి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తారని, ఉపాధి సిబ్బంది సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈసీ ఖాదర్ బాషా, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీ అయిన కేజీబీవీ ప్రిన్సిపాల్ తక్షణమే రిలీవ్ కావాలి

### టీఎన్ఎస్ఎఫ్ ఆందోళన ..

**పెద్దకడబూరు, నవంబర్ 22 :**
పెద్దకడబూరు గ్రామంలోని కస్తూరి బా గాంధీ బాలికల విద్యాలయంలో బదిలీ అయిన ప్రిన్సిపల్ రుక్సానా పర్వీన్ తక్షణమే రిలీవ్ కావాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బొగ్గుల సుధాకర్, సందీప్ డిమాండ్ చేశారు. శనివారం స్తానిక కేజీబీవీ వద్ద అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రిన్సిపల్ రుక్సానా పర్వీన్ ను తక్షణమే రిలీవ్ చేయాలని టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బొగ్గుల సుధాకర్, సందీప్ మాట్లాడుతూ గతంలో ప్రిన్సిపల్ రుక్సానా పర్వీన్ రెండు సార్లు సస్పెండ్ అయిందన్నారు. ఇక్కడ కూడా విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సౌకర్యాలు అందించక, సకాలంలో విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ప్రిన్సిపల్ రుక్సానా పర్వీన్ ను మద్దికేర కేజీబీవీకి బదిలీ చేశారని, ఇక్కడకు ప్రిన్సిపాల్ గా జ్యోతి బదిలీపై రావడం జరిగిందన్నారు. కానీ బదిలీ అయిన రుక్సానా పర్వీన్ ఇంతవరకూ రిలీవ్ కాలేదని, తక్షణమే రిలీవ్ అయి బాధ్యతలను జ్యోతికి అప్పగించాలన్నారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి అదేశాలను బేఖాతరు చేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రుక్సానా పర్వీన్ ను డీఈఓ వెంటనే సస్పెండ్ చేయాలని లేనిపక్షంలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు నరసప్ప, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బొగ్గుల సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న
ఎంపీడీవో లక్ష్మీకాంత్

## ఇళ్ల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోండి

**రామకుప్పం, నవంబర్ 22:**
మండలంలో అర్హులైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మీకాంత్ తెలిపారు. శనివారం ప్రజా ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం కోసం ఆన్లైన్ లో ఈనెల 30 తేదీలోగా బియ్యం కార్డ్, ఆధార్ కార్డ్ లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకు అవసరమైన సహాయ పరికరాలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 26న శాంతిపురం మఠం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరికరాల ఎంపిక కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు అలిమ్కో కంపెనీ ద్వారా ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షుడు వెంకటరమణ, ఆనంద రెడ్డి ,మాజీ ఏఎంసి చైర్మన్ సత్యంద్ర శేఖర్, కడ సభ్యుడు రఘు తదితరులు పాల్గొన్నారు.






ఆంజనేయ స్వామిని అలంకరించిన దృశ్యం . హెూమం నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా ఆంజనేయ స్వామి రథోత్సవం

**ఆదోని నవంబర్ 22:**
ఆదోనిలో ఉన్న క్రాంతి నగర్ లో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆకు పూజ కార్యక్రమం కూడా చేశారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. సాయంత్రం ఉత్సవ మూర్తిని రథోత్సవంలో ఉంచి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ముత్తైదువులో మంగళ హారతులతో గతం ముందు నడవగా పెద్ద ఎత్తున మహిళలు కోలాటం, నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఆలయ నిర్వాహకులు వీరేష్, వెంకటేష్ శెట్టి, లక్ష్మన్న, కార్తీక్, రామాంజనేయులు, సోమనాథ్, దేవరాజ్, రాఘవేంద్ర, హర్ష, రామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు. ప్రజలు పాల్గొన్నారు.





రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం .




ప్రసన్న చౌడేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద
భజన నిర్వహిస్తున్న భక్తులు

## ప్రసన్న చౌడేశ్వరి ఆలయంలో కలశ పూజలు

**రామకుప్పం, నవంబర్ 22:**
స్థానిక ప్రసన్న చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో కలశ పూజలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం గణపతి పూజ, జలాధివాసము, పంచామృతాధినివాసము, దాన్యాధివాసము మహా మంగళహారతి నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులను అలరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి పూజలను తిలకించారు. ఆలయ నిర్వాహకులు అన్నదాన వసతి ఏర్పాటు చేశారు.


## సాయిరాం సాయిరాం శతజయంతి సాయిరాం

### రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కే.హరిప్రసాద్..



***రోళ్ల, నవంబర్ 22 :***
దైవాంశ సంభూతుడు, అవతార పురుషుడు, సేవాతత్పరుడు శ్రీశ్రీశ్రీ సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా లేపాక్షి మండలం చోళ సముద్రం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు , రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కవి రచయిత కె. హరిప్రసాద్ బాబా జీవితచరిత్రను పాటలాగా రాసి పాడారు. భగవాన్ శ్రీ సత్య సాయిబాబా ఆశీస్సులతో పాట రాసినట్లు హరిప్రసాద్ తెలిపారు. సాయిరాం ఆశీస్సులతో ఈ పాటను ప్రజల ముందుకు తీసుకు వచ్చానని హరిప్రసాద్ తెలిపారు.

ఏమివ్వాలి.. ఏమివ్వాలి.. ఏమివ్వాలి..
సాయిరాం
శతజయంతి వేళ
సాయి నామస్మరణ వేళ
ప్రశాంతి నిలయంలోనా
ఆ అఖండజ్యోతి వేళ
నా ఆత్మార్పణమే ఈ వేళ
ఆ పరమాత్మ సాయినే
చేరే వేళ...
సాయి సాయి శ్రీ సత్యసాయి..
సాయి సాయి పుట్టపర్తి సాయి.
మానవ రూపంలో నా నడయాడిన
మానవతా దైవ స్వరూపమే సాయి నీవయ్యా
మా ఇలలోన ఇంటిలోన
ఈ ఈశుడే నీవయ్యా...
చిత్రావతి నది సమీపాన
ఈశ్వరమ్మ పెద్ద వెంకమ్మ రాజు కడుపులోన
నీవు
సత్యనారాయణ రాజుగా పుట్టి నీవు రోజు
రోజు శ్రీ సత్య సాయి
బాబాగా పెరిగి నీవు...
శిరిడి సాయి అవతారంగా మెరిసావయ్యా
బాబా
నీ మహిమలే చాటా వయ్యా బాబా...
ఊరు ఊరు వాడ వాడ పల్లె పల్లె
ప్రభంజనమే సృష్టించే భయ్యా
నీ మహిమలే బాబా బాబా
శ్రీ సత్య సాయి బాబా.....
సాయిరాం సాయిరాం
శ్రీ సత్య సాయిరాం...
ఖండాంతరాలే దాటి
నీ భక్తుల గుండెలోతుల్లోనా
సాయిరాం సాయిరాం సాయిరాం
శ్రీ సత్య సాయి బాబా గా
మురిపించావయ్యా
మై మరిపించావయ్యా...
దేశ విదేశాల హద్దులు
చెదిరేనయ్యా సాయిరాం
మన భారతదేశ సంస్కృతి
విదేశాల నోట మాట
నిలిచేనయ్యా పలికేనయ్యా సాయిరాం
సాయిరాం
వసుదైక కుటుంబమే
నీదయ్యా సాయి
భిన్నత్వంలో ఏకత్వం భక్తితో సాధించావయ్యా
సాయి...
సాయిరాం సాయిరాం సాయిరాం
రాయలసీమ రాళ్ల సీమగా
కరువు సీమగా కరాళరక్కసిగా
మారుతున్న వేళ ....
కన్నీటిని తుడిచే అభయహస్తం నీదయ్యా
సాయిరాం సాయిరాం
అపర భగీరథుడివై పల్లె పల్లె
నిలిపే నీటి ట్యాంకులై
సాయిరాం సాయిరాం
తాగునీరు సాగునీరు
అంతా సాయి రామ్
అనంతపురం జిల్లా
అంతా సాయిరాం.....
సాయి సేవా శాశ్వత సేవ
అదే కదా మాధవసేవ
శరణన్నవారికి అంతా సాయి రామ్
అనాధల పాలిట అభాగ్యుల పాలిట
ఆది అంతం అంత నేనే అంటూ
అక్కున చేర్చుకున్న సాయిరాం
మతాలకు అతీతంగా
కులాలకు అతీతంగా
మానవ కులం మనదంటూ...
విద్యా వైద్యం పేదలకు వరమంటూ
సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
కట్టించే ...
సాయిరాం సాయిరాం
సత్య ధర్మ ప్రేమ శాంతము లేకున్నా
అన్ని సున్నా అన్నా సాయిరాం సాయిరాం
సాయిరాం ...
ఈ ఇలలోన లోకకళ్యాణం కోసం
ప్రశాంతి నిలయం స్థాపించి విశ్వశాంతి
సాధించి
అవతార పురుషుడై అవతరించి
మాధవుడే మానవుడై జీవించి
విరాజిల్లి విలసిల్లిన
దాత విధాత భాగ్య ప్రదాత
శ్రీ సత్య సాయి బాబా...
సాయిరాం సాయిరాం సాయిరాం సాయిరాం
సాయిరాం.....
నా చూపు నీవే
నా కీర్తి నీవే
నా ఆశ నీవే
నా శ్వాస నీవే
నా విశ్వాసం నీవే
నా ఉచ్ఛ్వాసం నీవే
నా నిశ్వాసం నీవే
నీ మాటే నా మాట



నీ బాటే నా బాట
నీ అడుగులో అడుగునై
నీ మడుగులో మడుగునై
నా అడుగు వేశాను
అందలం ఎక్కాను
అందరి మెప్పు పొందాను
సాయిరాం సాయిరాం సాయిరాం
ఈ జన్మకు సాయిరాం
మరుజన్మకు సాయిరాం
ఓం సాయి శ్రీ సాయి
జయ జయ సాయి.....

## ప్రాపర్టీ కేసులు చేధించి రికవరీలు పెంచాలి

### జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం.. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ..

**ఆదోని నవంబర్ 22:**
ప్రాపర్టీ కేసులు చేధించి , రికవరీల శాతాలను బాగా పెంచాలని జిల్లాలోని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో నేర సమీక్షా సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు తగ్గించడమే లక్ష్యంగా కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ లలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధులలో రోడ్డు ప్రమాదాల నివారణ కు పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు రాత్రి వేళలో ఎక్కువ జరుగుతున్నాయన్నారు. గుంతలు, మలుపులు ఉన్నచోట రోడ్డు ప్రమాదాలు జరగవచ్చు అనే ప్రాంతాలను గుర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా రోడ్లకు తగిన మరమ్మతులు చేయించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే ఓవర్ లోడింగ్ వాహనాలను వెంటనే నిలిపి వేయాలన్నారు. మద్యం తాగి వాహనం నడుపరాదని, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, అతివేగం , హెల్మెట్ లేకుండా ప్రయాణించరాదని ప్రజలకు కౌన్సిలింగ్ చేయాలన్నారు. మర్డర్ ల కంటే రోడ్డు ప్రమాదాలలోనే మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించగలిగితే ఎంతో మంది కుటుంబాలు బాగు పడతాయన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ ల పై స్పెషల్ డ్రైవ్ చేపట్టి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సిసిఎస్ పోలీసులు కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ , కర్నూలు మూడవ పట్టణ పోలీసు స్టేషన్ లలో పెండింగ్ లో ఉన్న ప్రాపర్టీ కేసులను చేధించాలన్నారు. క్రైమ్ పార్టీ పోలీసులు కూడా బాగా పని చేయాలన్నారు. ఆదివారం పోలీసుస్టేషన్ లలో రౌడీ షీటర్లను బాగా కౌన్సిలింగ్ చేయాలన్నారు. వయస్సు పైబడిన కొందరు రౌడీ షీటర్లు, రౌడీషీట్ లను తొలగించాలని జిల్లా ఎస్పీ గారికి విన్నవించడం జరిగిందన్నారు. రేపు భారత్ బంద్ ప్రకటించిన సందర్భంగా పోలీసులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫేక్ ఎన్ కౌంటర్ పై కర్నూలు కలెక్టరేట్ దగ్గర ర్యాలీలో పాల్గొన్న వారి యొక్క పూర్తి వివరాలను సేకరించాలని అడిషనల్ ఎస్పీకి సూచించారు. సచివాలయం మహిళా పోలీసులను బందోబస్తు మినహా, స్టేషన్ రికార్డు విధులకు, రిసెప్షన్, అవగాహన కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. కోర్టులో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్ కు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్ బాగా చేయాలన్నారు. గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ గారు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ నేర సమీక్ష వేశంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు బాబు ప్రసాద్ , వెంకట్రామయ్య , హేమలత, భార్గవి , సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



## ఉప రాష్ట్రపతికి స్వాగతం

### బీజేపి సీనియర్ నేత విష్ణు వర్ధన్ రెడ్డి..

**పుట్టపర్తి, నవంబర్ 22:**
భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి మహెూత్సవాల సందర్భంగా పుట్టపర్తికి వచ్చిన ఉప రాష్ట్రపతి రాధాకృష్ణకు బీజేపీ సీనియర్ నేత, జాతీయ కమిటీ సభ్యుడు యస్. విష్ణు వర్ధన్ రెడ్డి ఉప స్వాగతం పలికారు.



పుట్టపర్తి విమానాశ్రయంలో
మంత్రి లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న
ఎమ్మెల్యేలు సునీత, సింధూర, మంత్రి సవిత

## సీఎంని కలిసిన రాయల్ మురళి



**అనంతపురం, నవంబర్ 22:**
భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పుట్టపర్తి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.



శివలింగానికి పూజలు చేసిన దృశ్యం

## కుప్పగల్ తిమ్మప్పకు ఘనంగా పూజలు

**ఆదోని నవంబర్ 22:**
ఆదోని మండలంలోని కుప్పగల్లు గ్రామంలో వెలసిన తిమ్మప్ప స్వామికి కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో వెలసిన శివలింగానికి కూడా పూజలు చేయడం జరిగింది. అర్చనలు, అభిషేకాలు, ఆకు పూజ కార్యక్రమాలు నిర్వహించారు, మధ్యాహ్నం తీర్థప్రసాదాలు అందజేశారు. అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.





కుప్పగల్ తిమ్మప్ప స్వామిని అలంకరించిన దృశ్యం



తహసిల్దార్ గ సుబ్బ లక్ష్మమ్మను పరామర్శిస్తున్న టిడిపి నేతలు

# తహసిల్దార్‌కు పరామర్శ

## మండల పార్టీ మాజీ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి.. ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షులు సాంబశివారెడ్డి..

**అట్లూరు, నవంబర్ 22:**
అట్లూరు మండల తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సుబ్బ లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ కడప నగరం హోలిస్టిక్ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన విషయం తెలుసుకున్న అట్లూరు మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు బోవిల్ల. అమర్నాథరెడ్డి, ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షులు పొన్నవోలు. సాంబశివారెడ్డి శనివారం పరామర్శించారు. ఆరోగ్య సంబంధిత విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆ భగవంతుని దయవల్ల త్వరగా కోలుకొని ప్రజలకు రెవిన్యూ పరమైన తమ సేవలు అందించాలని కోరారు.



ఎస్సై ధనుంజయుడుని సన్మానిస్తున్న గ్రామీణ వైద్యులు

# ఎస్సై ధనుంజయుడుని సన్మానించిన గ్రామీణ వైద్యులు

**దువ్వూరు, నవంబర్ 22:**
మండల పరిధిలోని గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో లో నూతనంగా వచ్చిన ఎస్సై ధనుంజయుడు, ని సన్మానించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , మండలం లో అందరూ ఐకమత్యంగా ఉండి నన్ను సన్మానించినందుకు ఆనందంగా ఉంది,అలాగే మీరు కూడా మీ పరిధి మించ కుండా వైద్యం చేసుకుంటూ ప్రథమ చికిత్స చేసుకుంటూ ప్రజల మన్నవలు పొందుతూ అందరితో స్నేహభావంగా ఉండాలని, మీకు ఎలాంటి ఇబ్బంది కలిగిన నాకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు మండల గ్రామీణ వైద్యుల అధ్యక్షుడు, అమీర్ భాష, ఉపాధ్యక్షుడు, తాహర్ హుస్సేన్ కోశాధికారి దస్తగిరి, శివ ప్రసాదు సుబ్బు, శ్రీనివాసులు, తిరుమలరావు, రాము, మాబు షరీఫ్, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్‌ని కలిసిన రాయల్ మురళి

**అనంతపురం, నవంబర్ 22:**
భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పుట్టపర్తి వచ్చిన రాష్ట్ర విద్యా ఐటీ శాఖ మంత్రివర్యులు గౌరవ నారా లోకేష్ బాబుని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.



# సొసైటీ ద్వారా రైతులకు రుణాలు

## రైతుల అభ్యున్నతే లక్ష్యంగా సొసైటీ సేవలు.. డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి..

**అట్లూరు, నవంబర్ 22:**
సొసైటీ ద్వారా రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందించడమే కాకుండా రైతుల అభ్యున్నతే లక్ష్యంగా అట్లూరు సొసైటీ ద్వారా సేవలు అందిస్తామని అట్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు , ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం అట్లూరు సొసైటీ కార్యాలయంలో నూతన సీఈవో చింతకుంట. వెంకటసుబ్బారెడ్డి (డిష్) అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీల ద్వారా తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు, పాడి,



సమావేశంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ మంచూరు

పరిశ్రమ ఎరువులను అందజేస్తామన్నారు.
రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కాకుండా రుణాలు అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సహకార సంఘాల ముఖ్య ఉద్దేశమని వివరించారు. నాటి సహకార సంఘాల స్ఫూర్తి నేటికీ కొనసాగుతున్నదని వెల్లడించారు. అట్లూరు సొసైటీ పరిధిలోని రైతులందరికీ సేవలు అందిస్తున్నామని చెప్పారు. సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు ఫర్టిలైజర్స్ మరియు వ్యవసాయ పనిముట్లు ట్రాక్టర్లు, పవర్ టిల్లర్, సేద్యపు గొర్రు తదితర పనిముట్లు తక్కువ ధరలకు అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.
ఈ సమావేశంలో అట్లూరు మండల క్రియాశీల నాయకులు రైల్వే కాంట్రాక్టర్ అరవ శ్రీనివాసులు రెడ్డి, మండల నాయకుడు పోతిరెడ్డి రెడ్డయ్య, ఎంపీటీసీ చిన్న, మట్లి ఈశ్వర్ రెడ్డి,పోతిరెడ్డి కృష్ణారెడ్డి,పొత్తపి. నరసింహ, పరశురాముడు మాజీ సర్పంచ్ నరసింహులు, మల్లెం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ప్రారంభం

## ఎమ్మెల్యే క్రిష్ణ చైతన్య రెడ్డి.. డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు ..

**బద్వేల్, నవంబర్ 22:**
కమలాపురం మండలం చదిపిరాళ్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కార్యాలయాన్ని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ నూతన కార్యాలయం ద్వారా రైతులకు మెరుగైన సహకార సేవలు అందుబాటులోకి వస్తాయని , చదిపిరాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఓ ఎం. వెంకటసుబ్బయ్య, విబరాపురంసొసైటీ అధ్యక్షులు లోమడ వాసుదేవరెడ్డి ఇతర అధికారులు, సొసైటీ అధ్యక్షులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మంచూరు


# నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలి

## మొండిగా వ్యవహరిస్తే కార్మికుల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదు.. ఏఐటీయూసీ బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్ ..

**బద్వేల్, నవంబర్ 22:**
లేబర్ చట్టాలను కుదిస్తూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన లేబర్ కోట్ చట్టాన్ని రద్దు చేసి ఉపసంహరించుకోకపోతే కార్మిక ఆగ్రహాన్ని ఆగ్రహాన్ని చవి చూడక తప్పదని ఏఐటియుసి బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్ హెచ్చరించారు, మున్సిపల్ కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మికులు స్వాతంత్రానికి పూర్వం నుండి అనేక పోరాటాలు నిర్వహించి ప్రాణాలు సైతం కోల్పోయి సాధించుకున్న సుమారు 29 చట్టాలను కుదించి నిన్నటి దినం గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమని ఇది కార్మికులకు శాపంల మారుతుందని తక్షణమే గెజిట్ను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున కార్మిక తిరుగుబాటులుపెద్ద ఎత్తున కార్మిక తిరుగుబాటును మోడీ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఎన్నికల్లో మాత్రం మాకు అధికారం ఇస్తే కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి ఉన్న కార్మికుల కడుపులు కొట్టడం దుర్మార్గమైన చర్య అని తక్షణమే విడుదల చేసిన గెజిట్ను రద్దుచేసి ఉపసంహరించాలని వారు కోరారు మరియు కార్మికులకు సుప్రీంకోర్టు ఉత్తర్వు మేరకు కనీస వేతన చట్టాన్ని అమలు చేసి 36వేల వేతనాన్ని ఇవ్వాలని, పని గంటల పొడిగింపును రద్దుచేసి 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని కార్మికులకు మౌలిక సౌకర్యాలు ఉద్యోగ భద్రతను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల మొండి వైఖరిని అవలంబిస్తే పెద్ద ఎత్తున తిరుగుబాటు తప్పదని కార్మిక ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురయ్య, శ్రీనివాసరాజు, బాబి, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశు, నరసయ్య, నరసింహులు, నాగేంద్ర, వైవి రమణ, శీను, గోపి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బద్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తన్న డిఎంహెచ్ఓ నాగరాజు

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

## ˜జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు..

**దువ్వూరు, నవంబర్ 22:**
ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పుల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శనివారం రోజు దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు , ఈ సందర్భంగా హాస్పటల్ నందు జరిగే అన్ని ప్రోగ్రామ్ ల పై రివ్యూ నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రతి నెల 10 కాన్పు లు జరిగే విధంగా యాక్షన్ ప్లాన్ రెడీ చేసుకొని గర్భవతులకు అవగాహన కల్పించి కాన్పుల సంఖ్య ను పెంచాలి అని సిబ్బందికి తెలియచేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు , డాక్టర్ రోషిని, డాక్టర్ హేమలత . సూపెర్వైసర్స్ , ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు .



గృహప్రవేశంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

# గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న రెడ్డి సంఘం నాయకులు

## నారుపల్లి జగన్‌మోహన్ రెడ్డి.. పొన్నపురెడ్డి శకుంతలా రెడ్డి ..

**దువ్వూరు, నవంబర్ 22:**
మండలంలోనిపెద్ద జొన్నవరంగ్రామంలో నూతన గృహప్రవేశ కార్యక్రమంలో అఖిలభారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులునారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, అఖిలభారత రెడ్డి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పొన్నపురెడ్డి శకుంతల రెడ్డి అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లదిమ్మురెడ్డి వెంకటేశ్వర రెడ్డి ధర్మపత్ని సునీత పాల్గొన్నారు. నూతన గృహప్రవేశంతోపాటు, సత్యనారాయణ వ్రతం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు అధికారులు, పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయం భూమి పూజలో పాల్గొన్న టిడిపి నాయకులు

# మాచినపల్లిలో పంచాయతీ భవనానికి భూమి పూజ

## టిడిపి మండల కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి..

**దువ్వూరు, నవంబర్ 22:**
మండల పరిధిలోని మాచనపల్లె గ్రామంలో 32 లక్షల రూపాయలతో పంచాయతీ కార్యాలయానికి మండల టిడిపి కన్వీనర్ బో రెడ్డి వెంకట రమణారెడ్డి ఎంపీడీవో సుబ్బారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బోరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ మచనపల్లె గ్రామపంచాయతీ కార్యాలయానికి ఎన్ ఆర్ ఈజీఎస్ మరియు ఆర్ జి ఎస్ ఏ పథకం కింద 32 లక్షలు నిధులుమంజూరు అయినట్లు తెలిపారు. దువ్వూరు మండలంలో మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చేస్తామని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బోరెడ్డి వెంకట రమణారెడ్డి తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శిభాగ్యలక్ష్మి, సర్పంచ్ జక్కు చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు గంగిరెడ్డి గారి భాస్కర్ రెడ్డి,సాకం రామసుబ్బారెడ్డి, సాకం నాగేశ్వరరెడ్డి, నాగేంద్ర యాదవ్ సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బీసీ బాలుర హాస్టల్ సందర్శన

## అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.ముఖేష్ కుమార్ ..

**బద్వేల్, నవంబర్ 22:**
. బద్వేల్ పట్టణంలో ఉన్న బిసి బాలుర వసతి గృహాన్ని శనివారం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ పి ముఖేష్ కుమార్ సందర్శించారు. హాస్టల్ విద్యార్థుల యోగక్షమాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వంటగదిని సామాగ్రిని పరిశీలించి పిల్లలకు రుచికరమైన భోజనం పెడుతున్నారని వాచ్ డబ్ల్యు ఓ, సిబ్బందిని అభినందించారు. .తర్వాత విద్యార్థులతో కాసేపు మాట్లాడి హాస్టల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నటువంటి పిల్లలకు ఆయన సలహాలు సూచనలు ఇచ్చారు. కష్టపడి చదివి హాస్టల్‌కు, తల్లిదండ్రులకు హెచ్‌డబ్ల్యూఓకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉన్నత శిఖరాలకు చేరి ఒక స్థాయిలో ఉండాలని విద్యార్థులకు సూచించారు . అనంతరం రికార్డ్స్ పరిశీలించారు. ఆయన వెంట కోర్టు సిబ్బంది , హెచ్‌డబ్ల్యుఓ నాగ దాసరి ప్రసాద్, హాస్టల్ సిబ్బంది ఉన్నారు.



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.ముఖేష్ కుమార్

# నూతన సాంకేతిక విద్యబోధనపై శిక్షణ

**రోళ్ల, నవంబర్ 22 :**
మండల కేంద్రంలోని మురళి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం నూతన సాంకేతిక విద్యకు అనుగుణంగా ఉపాధ్యాయులకు విద్యార్థులకు బెంగళూరు నుంచి విచ్చేసిన ఇంటర్ నేషనల్ లైఫ్ కోచ్ ఆరిఫ్ పాషా , సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ ట్రైనర్ అనిలా , కో ట్రైనర్ గురభ్ కుమార్ బృందంచే శిక్షణ తరగతులు నిర్వహించారు. రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతుల్లో భాగంగా మొదటి రోజు విద్యార్థుల కౌశల్య అభివృద్ధికి సాంకేతిక తోడ్పాటుకు దాని అవసరం గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. దీనికి అనుగుణంగా ఉపాధ్యాయులకు తగిన శిక్షణ నిర్వహణలో తీసుకోవాల్సిన సూచనలు ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జి. సన్న తిమ్మప్ప, పాఠశాల ఏవో యోగానంద్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి, ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ప్రత్యేక శిక్షణ బృందం







గ్రూప్‌లుగా విర్పడి నైపుణ్యతకు పదును పెట్టుతున్న ఉపాధ్యాయులు. ప్రత్యేక శిక్షణ బృందంతో పాఠశాల ఎచ్ ఎం యోగానంద్. ప్రత్యేక శిక్షణ బృందంతో ఉపాధ్యాయ బృందం



పుట్టపర్తి విమానాశ్రయంలో మంత్రి లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు కాలవ, సునీత, మంత్రి సవిత

# బాలలు మన జాతీయ సంపద



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు భరత్, మైలార్‌ను అభినందిస్తున్న హెచ్ ఎం లక్ష్మి శిరీష, పీడీ రాఘవేంద్ర

## రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు వెంకటాద్రిపల్లి హైస్కూల్ విద్యార్థులు

**భరత్, మైలార్‌ను అభినందించిన ప్రధానోపాధ్యాయులు లక్ష్మీశిరీష, పీడీ రాఘవేంద్ర..**

**బెళుగుప్ప,నవంబర్ 22:**
బెళుగుప్ప మండలం పరిధిలోని వెంకటాద్రి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భరత్, మైలార్ లు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల లక్ష్మీ శిరీష, పీడీ రాఘవేంద్ర తెలిపారు.వెంకటాద్రిపల్లి ఉన్నత పాఠశాల లో 9 తరగతి చదువుతున్న విద్యార్థులు భరత్ 66 కిలోల విభాగంలో,మైలార్ 55 కిలోల విభాగంలో జిల్లా స్థాయిలో జరిగిన జూడో పోటీలలో మొదటి స్థానం సాధించి,రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.వీరిని ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి లక్ష్మి శిరీష, పీడీ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందిచారు



గ్రామసభలో ప్రసంగిస్తున్న అధికారులు

## ఉపాధి పనులు కల్పించటమే లక్ష్యం

**గ్రామపంచాయతీల్లో గ్రామసభలు ..**
**ఎంపిడిఓ తేజోష్ణ.. ఏపీవో ఆదినారాయణమ్మ ..**

**పామిడి, నవంబర్ 22:**
గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివరించాలన్నదే గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం అని ఎంపిడిఓ తేజోష్ణ పేర్కొన్నారు. మండలంలోని గ్రామపంచాయతీల్లో జాబ్ కార్డులు ఈకేవైసీ నూతన జాబ్ కార్డుల మంజూరు ఉపాధి పనుల కల్పనపై ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. ప్రతిఒక్కరికీ పనులను కల్పించి ఉపాధి చూపించాలన్నదే ప్రభుత్వ ముఖ్యఉద్దేశ్యం అన్నారు. గ్రామసభల్లో ప్రస్తుతం ఉన్నటువంటి జాబ్ కార్డులను ఈకేవైసీ ద్వార రిజిష్ట్రేషన్ చేయించటం, మరణించిన వివాహమైన గ్రామం వదిలివెళ్ళిన వయస్సు పైబడిన వారి వివరాలను తెలియజేసి తొలగించే ప్రక్రియలో అభ్యంతరాలను స్వీకరించటం, అర్హులైన వారికి ఆధార్, రేషన్ కార్డులు, బ్యాంకు పాసుపుస్తకం ప్రతులతో నూతన జాబ్ కార్డుల మంజూరుకు పంచాయతీ కార్యదర్శి సంతకంతో దరఖాస్తులు స్వీకరించటం, అందరికి ఉపాధి పనులు కల్పిస్తామని తెలియజేస్తూ తెల్లకాగితంపై పనుల కోసం డిమాండ్ ఫారములను స్వీకరించటం జరుగుతుందని ఎంపిడిఓ తేజోష్ణ వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఏపీఓ ఆదినారాయణమ్మ, గ్రామపంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది, శ్రామికులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కోటి సంతకాల కార్యక్రమం విజయవంతం చేయండి

**వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి**

**కనేకల్ , నవంబర్ 22 :**
వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రభుత్వ వైద్యశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ, కోటి సంతకాల కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పట్టణంలోని వైయస్సార్సీపి నాయకుడు ఆదిసద్గురు చంద్రశేఖర్ రెడ్డి స్వగృహంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్యశాలలను అడ్డగోలు ప్రైవేటీకరణ చేసేందుకుపాల్పడుతుందన్నారు. ప్రైవేటీకరణ చేయడం వల్ల వైద్యులు అనే ఇబ్బందులకు గురి అవుతారని ప్రజలకు కార్పొరేట్ వైద్యం పేరుతో అధిక మొత్తంలో కూటమి ప్రభుత్వం డబ్బు వసూలు చేసే కార్యక్రమం మొదలుపెట్టిందన్నారు. దీనికి వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ముక్తకంఠంతో ప్రభుత్వ వైద్యశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తుందన్నారు. రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణ చేపట్టి తద్వారా వైద్యశాలలో ప్రైవేటీకరణకు గురి కాకుండా పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్ఆర్సిపి నాయకులు పకడ్బందీగా విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి,మాజీ కన్వీనర్ ఆలూరి చిక్కన్న మారంపల్లి మారెన్నా, వేమన, మక్బూల్ సాహెబ్, కో ఆప్షన్ నెంబర్ చిన్న శర్మాస్, చిక్కన్న తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్ఆర్సిపి నియోజకవర్గం సమన్వయ కార్యకర్త గోవిందరెడ్డి

## పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిని ఉపేక్షించం

**తెలుగుదేశం పార్టీ అధిష్టానం..**

**అనంతపురం, నవంబర్ 22 :**
ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వారికి కొమ్ముకాస్తూ స్వప్రయోజనాలు చూసుకునే పొద్దుతిరుగుడు పువ్వులకు తెలుగుదేశం పార్టీలో స్థానం లేదని పార్టీ అధిష్టానం స్పష్టంగా హెచ్చరికలు జారీ చేసింది. అనంతపురం నగరానికి చెందిన శిరశాల ఎర్రిస్వామి అలియాస్ శిరశాల రాంబాబు చేస్తున్న చర్యల మీద పార్టీ అధిష్టానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల కాలంలో రాంబాబు వ్యవహరించిన తీరు మీద పార్టీ అధిష్టానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు ఆయన వ్యవహార తీరు మీద మొదటి నుంచి పార్టీలో నిశిత పరిశీలన జరుగుతోంది. వైసిపి గెలుపు కోసం రాంబాబు విస్తృతంగా ప్రచారం చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆన్లైన్లో టిడిపి సభ్యత్వం చేసుకొని టిడిపి నాయకుల వెంట తిరుగుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నట్లు స్పష్టంగా గుర్తించింది. శిరశాల రాంబాబు అధికారికంగా పార్టీలో చేరకుండా తాను పార్టీలోనే ఉన్నానని పార్టీలో కష్టపడుతున్నానని నామినేటేడ్ పదవులు కావాలని, జిల్లా ఇంచార్జి మంత్రి టి.జి భరత్‌ను కలవడంపై పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది.

## బాలలను కాపాడవలసిన బాధ్యత అందరిది..

**బాలల భద్రత సామాజిక భాధ్యత...**
**ఆర్.డి.టి మహిళా సాధికారత డైరెక్టర్ డాక్టర్.విశాల ఫెర్రెర్..**





సమావేశంలో మాట్లాడుతున్న విశాలా ఫెర్రర్.

**అనంతపురం, నవంబర్ 22:**
బాలలు మన జాతీయ సంపద వారిని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిది అని ఆర్.డి.టి మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రెర్ అన్నారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఆర్.డి.టి బధిరుల ఉన్నత పాఠశాలలో ఆర్.డి.టి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్.డి.టి మహిళా సాధికారత





సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థినులతో విశాల

డైరెక్టర్ విశాల ఫెర్రెర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్, ఆర్.డి.టి డైరెక్టర్స్ మోహన్ మురళి, మహమ్మద్ రఫీక్, లక్ష్మణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాల ఫెర్రెర్ మాట్లాడుతూ బాలలు కుడా తమ హక్కులను, భాధ్యతలను తెలుసుకొని నేటి బాలలే రేపటి పౌరులు ఎదగాలన్నారు. ప్రతి ఒక్కరు అత్యన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఎదురైయ్యే సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్ డి టి సంస్థ బాలల హక్కుల పరిరక్షణ కోసం ముందస్తు చర్యగా అన్ని ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలని ఏర్పాటు చేస్తోందన్నారు. పిల్లలకు, తల్లిదండ్రులకు సమాజంలో పిల్లల సమస్యల పట్ల అవగాహన కల్పిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంలో ఆమె ఈ ఏడాది అంతర్జాతీయ బాలల దినోత్సవ థీమ్ అయిన ఎవరీ చైల్డ్ ఎవరీ రైట్... మై డే మై రైట్స్ ను ప్రస్తావిస్తూ "ప్రతి పిల్లవాడి హక్కు ప్రతి రోజూ గౌరవించబడాలన్నారు. పిల్లలు సురక్షితంగా, రక్షితంగా, గౌరవంతో పెరిగే వాతావరణం కల్పించడం సమాజం మొత్తానికి ఉన్న పెద్ద బాధ్యత అన్నారు. పిల్లల ప్రతి రోజును వారి హక్కుల రోజుగా మార్చేందుకు మనందరం కలిసి పనిచేయాలి," కోరారు .జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్ మాట్లాడుతూ ఆర్ డి టి సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బాలల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ప్రతి గ్రామంలో బాల్యవివాహాల నిర్మూలనకు శ్రద్ధ చూపడం ఎంతో అభినందనీయం అన్నారు. చివరిగా చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటిలలో గెలుపొందిన బాల బాలికలకు, ముఖ్య అతిథుల చేత బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కౌన్సిలర్ హేమలత, అసిస్టెంట్ డైరెక్టర్ ఉగంధర్ నాయుడు, ఆర్ డి టి కోఆర్డినేటర్స్ ఆదినారాయణ,అరుణ,గీత,కృష్ణయ్య,సుదీర్ రెడ్డి, రిజినల్ ఇంజినీర్ జ్యోతి,ప్రధానోపాధ్యాయులు నరేంద్ర, ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చిన్నారులు పాల్గొన్నారు.





విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేస్తున్న విశాల. ఆర్డిటి పెద్దలు

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన జీవనం

**హిరమండలం, నవంబర్ 22:**
హిరమండలం పిహెచ్ సి పరిది లోని గ్రామ సచివాలయం లలో ఫ్రైడే డ్రైడే, పారిశుధ్య కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎం లు, మగ ఆరోగ్య కార్యకర్తలు, ఎం ఎల్ హెచ్ పి లు ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించారు. పారిశుధ్య కార్యక్రమాలు పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సాయికుమార్



మురికి కాల్వల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తో ఆరోగ్యకరమైన జీవనం సాగించడానికి దోహదపడుతుందని తెలిపారు. హిరమండలం,అంబావిల్లి, అక్కరాపల్లి, పెద్ద కిట్టాలపాడు, కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైద్యధికారి . సాయికుమార్, పిహెచ్ ఎన్ - ఆర్. ఆదిలక్ష్మి, హెచ్ వి-వి. రోజారమణి, ఆరోగ్య కార్యకర్తలు -విఎంవి రాజు, జి. రామారావు, ఎల్. దమయంతి, రేవతి, బొమ్మాలి లక్ష్మి, . ఎం ఎల్ హెచ్ పి లు-దేవిక, స్వర్ణ, అల్లక వినీత ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

## పాతపట్నంలో జనసేనను బలోపేతం చేయాలి

**స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులు విజయానికి కృషి ..**
**మండలం సాయి విస్తృత సమావేశం ..**
**సుడా చైర్మన్ కొరికాన రవికుమార్..**
**జనసేన నాయకురాలు కొరికాన భవాని ..**

**ఎల్ఎన్ పేట, నవంబర్ 22:**
పాతపట్నం నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుండి జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సుడా చైర్మన్ కొరికాన.రవికుమార్, పాతపట్నం నియోజకవర్గం జనసేన నాయకురాలు కొరికాన.భవాని కోరారు. శనివారం లక్ష్మీ నర్సు పేట జంక్షన్ లోని ప్రయివేటు కళ్యాణ మండపం యందు జనసేన మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీ, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం,సిద్ధాంతాలు పట్ల ప్రజలు మంచి అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.వీటికి అనుగుణంగా ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.విస్తుతం గా ప్రచారం చేపట్టి ప్రజలకు చేరువకావలని ఆయన తెలిపారు.యువత, మహిళలు తోపాటు వివిధ వర్గాల ప్రజలు పార్టీ పట్ల ఆసక్తి చూపుతున్నారని, వారిని పార్టీ లో చేర్పించి బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు.రానున్న స్థానిక సంస్థలు దృష్టిలో పెట్టుకొని గ్రామస్థాయి లో పార్టీ పటిష్టంగా చేసి పార్టీ అభ్యర్థులు విజయానికి కృషి చేయాలని కోరారు.అంతకుముందు సుడా చైర్మన్ రవికుమార్,జనసేన నాయకురాలు భవాని ను జనసేన నాయకులు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం లో జనసేన మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



రవికుమార్, భవాని దంపతులకు సన్మానం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ రవికుమార్. పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

## హమాలీ కార్మికులకు గుర్తింపుకార్డులు పంపిణీ

**దర్శి ఎస్ఐ ఎం. మురళి..**

**దర్శి, నవంబర్ 22:**
దర్శి పట్టణంలో హమాలీకార్మికులుగా పనిచేస్తున్న 120 మందికి దర్శి ఎస్ఐ ఎం. మురళి శనివారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఏఐటియుసి ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ హమాలీ కార్మికులు కష్టజీవులని, రాత్రనక పగలనక పనిచేసే శ్రమజీవులని ఆయన అన్నారు. వస్తున్న సిమెంటు బస్తాలు, ఇనుప కడ్డీలు లోడింగ్ అన్లోడింగ్ చేస్తుంటారని, రాత్రి సమయంలో చుట్టుపక్కల ప్రాంతాలకు వెళుతుంటారని, అందువల్ల ఈ గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ద్విచక్రవాహనాలు నడిపేసమయంలో మద్యం సేవించి నడపరాదని, మురళి అన్నారు.
ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ హమాలీ కార్మికుల ఇబ్బందులు గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేసినందుకు దర్శి ఎస్ఐ మురళికి ధన్యవాదాలు తెలిపారు. గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కోటేశ్వరరావు సూచించారు. జిల్లా ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కోటం చెట్టి హనుమంతరావు మాట్లాడుతూ హమాలీ కార్మికులంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆయన తెలిపారు. అనంతరం హమాలీ కార్మికులు దర్శి ఎస్ఐని శాలువాలుకప్పి పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎఐటియుసి నాయకులు సింగరాకొండ శీను, హమాలీ మేస్త్రులు బీర్జాల శ్రీనివాసరావు, వెంకట్రావు శీను, చెన్నకేశవులు, భిక్షాలు తదితరులు పాల్గొన్నారు.



నక్కలపల్లిలో గ్రామ సర్పంచ్ రామిరెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరిస్తున్న నాయకులు

## వైకాపా కోటి సంతకాల సేకరణ

**నక్కలపల్లి సర్పంచ్ రామిరెడ్డి..**

**బెళుగుప్ప నవంబర్ 22:**
బెళుగుప్ప మండలం పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ రామిరెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామిరెడ్డి ఉరవకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి ఆదేశాలతో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం వలన జరిగే నష్టాలు, కష్టాల గురించి ప్రజలకు వివరించారు. గత వైసిపి ప్రభుత్వంలో 17 నూతన మెడికల్ కాలేజీలను తీసుకొచ్చి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ వైసిపి కోటి సంతకాల సేకరణ చేపట్టిందని, ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలంటూ ప్రజలను కోరుతూ సంతకాలు చేయించారు.

# వారణాసిలో మ్యూజిక్ అదుర్స్



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. ప్రజలు కూడా ఈ మూవీపై క్యూరియసిటీతో ఉన్నారు. తాజాగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమాపై మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. 'వారణాసి'లో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. 'అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతాన్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. 'వారణాసి'లో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసే పని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడిగా కూడా ఉండదు. నాకు ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందరగోళం లేదని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో 'రణ కుంభ' ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ సృష్టిస్తోంది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'స్టూడెంట్ నెం.1', 'యమదొంగ', 'మగధీర', 'ఈగ', 'బాహుబలి'లోని పాటలు నేటికీ సోషల్‌మీడియా రీల్స్‌లో వైరల్ అవుతూనే ఉన్నాయి. ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'వారణాసి'కి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో పలు భాషలకు చెందిన అగ్రతారలు నటిస్తున్న నేపథ్యంలో దీని బ్జడెట్‌పై వార్తలు వెలువడుతున్నాయి. వీరికి భారీ పారితోషికం ఇవ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రబ్జడెట్ ఏకంగా రూ.1100 కోట్లని ప్రచారం జరుగుతోంది. 2027 వేసవిలో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## ప్రభాస్ ఫౌజీపై ఊహాగానాలు





ఇప్పటి వరకు రెబల్ స్టార్ 'ప్రభాస్' సీక్వెల్ మూవీస్ మాత్రమే చేశారు. రెండు భాగాలుగా వచ్చిన 'బాహుబలి' భారీ విజయాన్ని సాధించగా.. నెక్స్ట్ కల్కి 2, సలార్ 2 రెడీ అవుతున్నాయి. ఈ లిస్ట్‌లో రాజాసాబ్ కూడా ఉంది. అయితే ఇవన్నీ సీక్వెల్స్ మాత్రమే. ఇప్పుడు ఓ సినిమాకు ప్రీక్వెల్ ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాల్లో 'ఫౌజీ' కూడా ఒకటి. సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగష్టులో ఈ సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఫౌజీ చిత్రానికి ప్రీక్వెల్ చేసే ప్లానింగ్‌లో ఉన్నారట రాఘవపూడి. ఇప్పటి వరకు వచ్చిన ఫౌజీ అవుట్ పుట్ పట్ల ప్రభాస్ చాలా హ్యాపీగా ఉన్నారట. హను వర్క్‌కు ఫిదా అవుతున్నాడట డార్లింగ్. అందుకే ఆయనతో మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఓ టాక్ ఉంది. ఇప్పుడు దాదాపుగా ప్రీక్వెల్ ఫిక్స్ అయినట్టేనని తెలుస్తోంది. అయితే ఫౌజీ రిజల్ట్‌ను బట్టి ఈ ప్రాజెక్ట్ ఉంటుందా?, ఉండదా? అనేది డిసైడ్ కానుంది. ఫౌజీ హిట్ అయితే ప్రీక్వెల్ ఉండే ఛాన్స్ ఉంది, లేదంటే లేదు. ఏదేమైనా ఫౌజీ మాత్రం మామూలుగా ఉండదనేది ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. యుద్ధంలో పుట్టిన ప్రేమకథగా ఈ సినిమా ఉంటుందని ముందు నుంచి ప్రచారంలో ఉంది. మరి ఈసారి హను ఎలా ప్లాన్ చేస్తున్నాడో చూడాలి.

## మహిళలు బలహీనులు కాదు



ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకెళ్తున్న హీరోయిన్ రష్మిక మందన్నా, భాష ఏదైనా పట్టించుకోకుండా వరుస సినిమా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. అదే వేగంతో విజయాలు కూడా అందిపుచ్చుకుంటూ స్టార్ హీరో రేంజ్ ఫ్యాన్‌బేస్‌ను సంపాదించుకుంది. తాజాగా విడుదలైన 'గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న రష్మిక, సినిమాలకే కాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండి అభిమానులతో కంటిన్యూ టచ్‌లో ఉంటుంది. ఇటీవల ఆమె స్త్రీశక్తి గురించి ఓ ఆసక్తికరమైన పోస్ట్‌ను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. అమ్మాయిలంతా ఏకమై నిలిస్తే ఆ శక్తిని ఎవరూ ఆపలేరని ఆమె స్పష్టంగా తెలిపింది. మహిళల మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం వేరే స్థాయిలో ఉంటుందని, మంచి స్నేహితురాలితో దగ్గరైతే జరగబోయే విషయాలు ముందే అర్థమైపోతాయనే ఫీలింగ్ కలుగుతుందని చెప్పింది. స్త్రీలు ఒకరికొకరు మద్దతు ఇస్తే జీవితం మరింత సులభమవుతుందని, వారు బలహీనులు కాదు, ఎంతో ప్రేమతో, బలంతో ఉండే వ్యక్తులని రష్మిక పేర్కొంది. ఎల్లప్పుడూ తనతో ఉండే స్నేహితురాళ్లకు కృతజ్ఞతలు చెబుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో కూడా ఇలాంటి మంచి ఫ్రెండ్స్ ఉండాలని కోరుకుంటు న్నానని ఆమె చెప్పింది.

## సినిమాలో ఏఐ ట్రెండ్



మహ్మదన్ రఫీతో సోనూ నిగమ్ పాట కృత్రిమ మేధ ఏఐ సంగీత రంగంలోనూ సరికొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేస్తోంది. ఏఐతో ఇప్పటి వరకూ దివంగత గాయకుల గొంతులను సినిమాల్లో వినిపించారు సంగీత దర్శకులు. ఇప్పుడీ ట్రెండ్‌ను గాయకుడు సోనూ నిగమ్ లైవ్ కాన్సర్ట్‌లోకి తెచ్చారు. లైవ్‌లో ఏఐ వినియోగించి దివంగత గాయకుడు మహమ్మద్ రఫీతో కలిసి డ్యుయెట్ పాడి ఔరా అనిపించారు.ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో సోనూ నిగమ్ కాన్సర్ట్ ఏర్పాటు చేశారు. అందులో రఫీకి సోనూ నిగమ్ అద్భుతమైన నివాళు లర్పించారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి రఫీతో గొంతుకలిపారు. స్క్రీన్‌పై రఫీ వీడియో, ఆయన గొంతు వినిపించడంతో అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఇది మరపురాని అనుభూతి' అని అభిమానులు పేర్కొనగా, 'ఏఐని సరిగ్గా ఉపయోగించారు. ఇది కొత్త ట్రెండ్' అంటూ పలువురు ప్రశంసలు కురిపించారు. 1924 డిసెంబరు 24న జన్మించిన ఆయన ఎన్నో భాషల్లో వేల పాటలు పాడి రికార్డులు సృషించారు. ఆయన బయోపిక్ తీసేందుకు బాలీవుడ్‌లో సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక సోనూ నిగమ్ హిందీతో పాటు దక్షిణాది చిత్రాల్లోనూ సూపర్ హిట్ సాంగ్స్‌తో అలరిస్తున్నారు.

## మోహనరాగ మ్యూజిక్ లాంచ్ చేసిన మంచు మనోజ్



టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ఆరంభించారు. ఈసారి సినీ సెట్‌లో కాదు? సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఆయన కొత్త మ్యూజిక్ లేబుల్ 'మోహన రాగ మ్యూజిక్' శనివారం అధికారికంగా లాంచ్ అయింది. చాలా ఏళ్లుగా తన మనసులో దాగి ఉన్న ఈ కల నేడు నెరవేరిందని మనోజ్ భావోద్వేగంగా వెల్లడించారు. ట్విటర్‌లో 'మోహన రాగ మ్యూజిక్' పేరుతో ఓ సరికొత్త సంగీత సంస్థను ప్రారంభించబోతున్నట్టు చెప్పుకొచ్చారు మంచు మనోజ్. మ్యూజిక్ అంటే తనకు ఎంతో ఇష్టమని? ఈ సంస్థ ద్వారా న్యూ యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించనున్నట్లు చెప్పుకొచ్చాడు. 'లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. సంగీతం ఎల్లప్పుడూ నా ఎస్కేప్. నా ఎక్స్‌ప్రెషన్, నా నిజం. ఈ రోజు ఆ జర్నీ డెవలప్ అవుతోంది. నా కొత్త ప్రపంచ మ్యూజిక్ వెంచర్ ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. మోహన రాగ మ్యూజిక్? యంగ్ టాలెంట్, కరేజ్, నిర్భయమైన సృజనాత్మక కోసం నిర్మించాం అని మంచు మనోజ్ స్పష్టం చేశాడు. నటుడిగా ఎన్నో సినిమాల్లో తనకంటూ ప్రత్యేకమైన మార్క్ సంపాదించిన మనోజ్, సంగీతంపై కూడా మంచి పట్టు ఉన్న సంగతి చాలా మందికి తెలియదు. పోటుగాడు సినిమాలో 'ప్యార్ మే పడిపోయా' పాటను స్వయంగా పాడారు. కరోనా సమయంలో విడుదల చేసిన 'అంతా బాగుంటాంద్రా' పాటకు విపరీతమైన స్పందన వచ్చింది అంతేకాదు పిస్తా పిస్తా, ఎన్నో ఎన్నో, ప్రాణం పోయే బాధ వంటి పాటలకు లిరిక్స్ కూడా రాశారు.అతని స్వరంలో ఉండే సహజమైన ఎమోషన్, సంగీతాన్ని వ్యక్తీకరించే తీరు ప్రత్యేకమని ఆయన అభిమానులు అప్పుడప్పుడూ చెబుతుంటారు. మనోజ్ తండ్రి డాక్టర్ మంచు మోహన్ బాబు, అన్న మంచు విష్ణు, అక్క లక్ష్మి మంచు సినిమాలకు సంగీతం, యాక్షన్ విభాగాల్లో కూడా పనిచేసిన విషయాన్ని మనోజ్ గుర్తుచేశారు. మోహన రాగ అనే పేరుకు తనకూ, తన కుటుంబానికీ ప్రత్యేకమైన అనుబంధం ఉందని తెలిపారు.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.